RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18 | సంచిక : 188 | Vol : 18 | Issue : 188

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, బుధవారం 23 సెప్టెంబర్ 2026
Warangal, Wednesday 23 September 2026

పేజీలు : 08 | వెల రూ : 4-00
Pages : 08 | Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

## వందేమాతరం చరణాల గీతాలాపన వ్యక్తిగత నిర్ణయం

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** జాతీయ గేయం వందేమాతరం ఆలాపనపై సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఎన్ని చరణాలు పాడాలనేది పౌరుల వ్యక్తిగతమని ఉద్ఘాటించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 ప్రకారం నిజమైన మతపరమైన అభ్యంతరాలు ఉన్న ఎవరిపైనా అందులోని వివాదాస్పద చరణాలు పాడలేదనే కారణంతో క్రిమినల్ చర్యలు తీసుకోలేరని తేల్చిచెప్పింది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలను తప్పనిసరిగా ఆలపించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

అలాగే జాతీయ గౌరవ అవమానాల నిరోధక చట్టం కింద వందేమాతరాన్ని జాతీయ గీతంతో సమానంగా సవరణ చేస్తూ వెలువరించిన ఉత్తర్వులను ప్రముఖ (మిగతా 2లో)

## ఖాకీల వేషంలో కామాంధులు

- పోలీసులమని చెప్పి బాలికపై గ్యాంగ్ రేప్!
- ఢిల్లీలో మరో దారుణం..



పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణం వెలుగులోకి వచ్చింది. మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం ఘటన కలకలం రేపుతోంది. కల్కాజీ ప్రాంతంలోని ఆస్థాకుంజ్ పార్కులో ముగ్గురు వ్యక్తులు పోలీసులమంటూ నటించి 17 ఏళ్ల బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన సెప్టెంబర్ 21, సోమవారం రాత్రి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మైనర్ బాలిక తన 17 ఏళ్ల స్నేహితుడితో కలిసి ముందుగా కల్కాజీ ఆలయానికి వెళ్లింది. అనంతరం రాత్రి 7.30 గంటల సమయంలో ఆస్థా కుంజ్ పార్కులోకి వెళ్లారు. అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు తాము పోలీసులమని పరిచయం చేసుకుని, ఇద్దరూ మైనర్లని చెబుతూ

(మిగతా 2లో...)



## మాటలేనా... చేతలెక్కడ?

- రేవంత్‌రెడ్డివన్నీ విఫల చర్యలే...!
- కేసీఆర్ కుటుంబంపై గతం నుంచి భారీ అవినీతి ఆరోపణలు..
- కాళేశ్వరం నుంచి కార్ రేస్ వరకు తుస్సు...!
- తాజాగా కేసీఆర్ కుటుంబ భూముల వ్యవహారంపై రేవంత్ దూకుడు
- అసెంబ్లీ వేదికగా సీఎం విచారణకు ఆదేశం
- ఇది కూడా విఫల చర్యగానే మారనుందా?

వల్లంపట్ల క్రిష్ణాకర్ - నెట్‌వర్క్ ఇన్‌చార్జి

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు-ప్రత్యారోపణలు కొత్తేమీ కాదు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై చేసిన తీవ్ర ఆరోపణలు, వాటిపై చర్యల విషయంలో ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. విమర్శలు, ప్రకటనలు పదునుగా ఉన్నా.. ఆ స్థాయిలో చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు, ఈ-కార్ రేస్‌తో పాటు ఇతర పనుల్లో భారీగా అవినీతి జరిగిందని, వాటిపై విచారణ జరిపి ప్రజల్లో దోషులుగా నిలబెడతామని గర్జించిన రేవంత్‌రెడ్డి చివరకు ఏమీ చేయలేకపోయారనే అపవాదు మూటగట్టుకున్నాడు. ఇక ప్రస్తుతం కేసీఆర్ కుటుంబం భూములను టార్గెట్ చేసిన రేవంత్‌రెడ్డి ఇందులో కూడా తుస్సుమనే అవకాశాలే మెండుగా కన్పిస్తున్నాయనే చర్చ జరుగుతోంది.

**కాళేశ్వరంపై గర్జనలు.. ఆ తర్వాత సైలెంట్?**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, వ్యయం, అవకతవకలకు సంబంధించి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఆరోపణలు చేసింది. ప్రాజెక్టులో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని

(మిగతా 2లో...)



## బాధితులే బంగారు బాతులు

- గోల్డ్‌లోన్ పేరిట ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల అరాచకం
- గుట్టు చప్పుడు కాకుండా బంగారు నగల అమ్మకాలు
- ఫైనాన్స్ సంస్థలతో పసిడి వ్యాపారుల కుమ్మక్కు?
- బంగారు ఫైనాన్స్ సంస్థలపై ఒకే ఒక్కడు పెత్తనం
- ఫైనాన్స్ సంస్థ సిబ్బందికి పారితోషికాలతో గాలం
- బంగారం కుదవబెట్టి వడ్డీకి తీసుకుంటున్న సామాన్యులు
- కొన్ని సందర్భాల్లో వడ్డీ కట్టలేకపోతున్న బాధితులు
- వేలం వేస్తామంటూ నోటీసులు జారీ
- సమయం దాటక ముందే బంగారం మాయం
- వేలం వేయకుండానే బంగారు వస్తువుల అమ్మకం
- లబోదిబోమంటున్న బాధితులు

పీపుల్స్ డైరీ ప్రతినిధి, వరంగల్

బంగారం వస్తువులు కుదవపెట్టుకుని రుణాలిచ్చే ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు కొత్త రకం దోపిడీకి తెర లేపుతున్నారు. కుదవపెట్టిన బంగారాన్ని సంస్థ తరపున సిబ్బంది నోటీసులు జారీ చేస్తూ ప్రైవేట్ వ్యక్తులకు అమ్మకాలకు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే వరంగల్ నగరంలో పదుల సంఖ్యలో పేరు గాంచిన ఫైనాన్స్ సంస్థలు ఉన్నాయి. పేద ప్రజల కొరకు తక్కువ వడ్డీకి ఆశ చూపి అవసరాల నిమిత్తం లోన్ రూపంలో తీసుకున్న డబ్బులు తిరిగి వడ్డీ కట్టని యెడల బంగారు వస్తువును వేలం వేయటానికి అవకాశం ఉంటుంది. కానీ ఇక్కడ (మిగతా 2లో...)

## ముగ్గురు పసికందులు మృతి

- ఆదిలాబాద్ 'రిమ్స్'లో ఘోరం...
- ఏసీ పేలడంతో అగ్నిప్రమాదం...
- మరో ముగ్గురు చిన్నారుల పరిస్థితి విషమం



పీపుల్స్‌డైరీ-ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. హాస్పిటల్‌లోని చిన్న పిల్లల వార్డులో ఏసీ పేలి మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో అక్కడున్న శిశువుల తల్లిదండ్రులు, సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో వార్డులో సుమారు 27 మంది చిన్నారులు ఉన్నట్లు తెలిసింది. పొగలు వేగంగా వ్యాపించడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎత్తుకొని బయటకు పరుగులు తీశారు. పరిస్థితిని గమనించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే విద్యుత్తు (మిగతా 2లో...)

## కారు ఢీకొని యాచకురాలు మృతి..

### యాదగిరిగుట్టపై విషాదకర ఘటన




**పీపుల్స్‌డైరీ-యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కొండపై మంగళవారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. పుష్కరిణి సమీపంలో ఓ కారు ఢీకొనడంతో యాదగిరిగుట్టకు చెందిన యాచకురాలు మృతి చెందారు. ఈ ఘటనతో ఆలయ అధికారులు దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. యాదగిరిగుట్టకు చెందిన ఈశ్వరమ్మ కొంతకాలంగా కొండపై భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఆమె పుష్కరిణి సమీపంలో ఉండగా ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఈశ్వరమ్మ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో (మిగతా 2లో...)

## ఓయోలో యువతి అనుమానాస్పద మృతి

- పరారీలో ప్రియుడు, ఏం జరిగింది..?
- హైదరాబాద్ మాదాపూర్‌లో ఘటన
- యువతి ముఖం, తలపై గాయాలు?

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్ మాదాపూర్ సిద్ధిఖీనగర్‌లోని ఓయో హోటల్‌లో యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. హోటల్‌లోని రూమ్ నంబర్ 303లో ఈ ఘటన చోటుచేసుకుంది. విశాఖపట్నానికి చెందిన యువతి తన ప్రియుడు శ్రీనివాస రవి తేజతో కలిసి హోటల్‌కు వచ్చినట్లు ప్రాథమిక సమాచారం. ఇద్దరూ ఓయో యాప్ ద్వారా గదిని బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో యువతిని అనారోగ్యంగా ఉందంటూ ప్రియుడు ఆసుపత్రికి తరలించినట్లు హోటల్ సిబ్బంది తెలిపారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యువతి ముఖం, తలపై గాయాలు, వాపులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆమె అనారోగ్యంతో మృతి చెందిందా? లేక ఆమెపై దాడి జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. (మిగతా 2లో...)



# మాటలేనా.. చేతలెక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. కేసీఆర్, హరీశ్‌రావులపై బాధ్యత నిర్ధారిస్తామని కూడా కాంగ్రెస్ నేతలు రాజకీయంగా విమర్శలు చేశారు. అయితే విచారణ ప్రక్రియ, దాని ద్వారా వెలువడే నివేదికలు, తదుపరి చట్టపరమైన చర్యలపై ప్రజల్లో భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాము ఆశించిన స్థాయిలో రాజకీయంగా సంచలనం సృష్టించే చర్యలు కనిపించలేదని ప్రతిపక్ష వర్గాలు విమర్శిస్తున్నాయి.

**కేటీఆర్ కార్ రేస్ విషయంలోనూ నెమ్మదితనం...**

హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా ఈ-రేస్‌కు సంబంధించిన వ్యవహారంలోనూ కేటీఆర్‌పై ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేసింది. నిబంధనల ఉల్లంఘన, ప్రభుత్వ నిధుల వినియోగం తదితర అంశాలపై దర్యాప్తు, చట్టపరమైన చర్యలు తప్పవని అధికార పక్షం ప్రకటించింది. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. కానీ కాలం గడిచేకొద్దీ ఈ అంశంపై గతంలో కనిపించిన రాజకీయ వేడి తగ్గిపోయిందని బీఆర్ఎస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. ప్రకటనల స్థాయిలో కనిపించిన దూకుడు.. తదుపరి పరిణామాల్లో ఎందుకు కనిపించలేదన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**ఇప్పుడు భూముల బాంబు**

ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. కేసీఆర్ కుటుంబం వద్ద పెద్ద ఎత్తున అక్రమంగా భూములు ఉన్నాయని, వాటిపై విచారణ జరిపి వాస్తవాలను వెలికితీస్తామని, అవసరమైతే ఆ భూములను దళితులకు పంపిణీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

తాజా ఆరోపణలపై ప్రభుత్వం ఎలాంటి విచారణ చేపడుతుంది? ఏయే భూములను పరిశీలిస్తుంది? వాటి యాజమాన్య హక్కులు, కేటాయింపులు, రికార్డుల్లో ఉన్న వివరాలు ఏమిటి? విచారణలో అక్రమాలు నిర్ధారణ అయితే ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది? అన్నదే ఇప్పుడు కీలకంగా మారింది.

**మాటల నుంచి చేతల దిశగా వెళ్తారా?**

కేసీఆర్ కుటుంబంపై గతంలో వచ్చిన ఆరోపణలు, కాళేశ్వరం వ్యవహారం, కార్ రేస్ అంశాల నేపథ్యంలో.. తాజాగా భూములపై సీఎం చేసిన ప్రకటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పటివరకు చేసిన ఆరోపణలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి? వాటి ఫలితాలు ఎక్కడున్నాయి? అన్న ప్రశ్నలను ప్రతిపక్షాలు సంధిస్తున్నాయి. తాజా భూ ఆరోపణల విషయంలోనూ ఇదే పరిస్థితి పునరావృతమవుతుందా? లేక ప్రభుత్వం పక్కా ఆధారాలతో విచారణ జరిపి, అక్రమాలు నిర్ధారణైతే చట్టపరమైన చర్యలకు వెళ్తుందా? అనేది వేచి చూడాల్సిందే.

**రాజకీయ బాణాలు.. ప్రజల ప్రశ్నలు**

కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు చేయడం ఒక అంశమైతే.. వాటిని ఆధారాలతో నిరూపించి, చట్టపరమైన ప్రక్రియ ద్వారా బాధ్యతను నిర్ధారించడం మరో అంశం. రాజకీయ ప్రకటనలు ఎన్ని వచ్చినా చివరికి ప్రజలు గమనించేది ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వాటి ఫలితాలనే. అందుకే తాజా భూముల వ్యవహారంపై సీఎం చేసిన ప్రకటనపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. గత ఆరోపణల మాదిరిగానే ఇది కూడా రాజకీయ ప్రకటనలకే పరిమితమవుతుందా? లేక విచారణ నుంచి చట్టపరమైన చర్యల వరకు ప్రభుత్వం ముందుకు వెళ్తుందా? 'మాటలేనా.. చేతలెక్కడ?' అన్న ప్రశ్నకు రేవంత్ ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందో చూడాలి.

# బాధితులే బంగారు బాతులు..!

(మొదటి పేజీ తరువాయి)

అలా జరగటం లేదనే వాదనలు వెలువడుతున్నాయి. ఏకంగా బంగారం వ్యాపారం నిర్వహిస్తున్న కొంత మంది బడా బాబులు ఫైనాన్స్ సంస్థల సిబ్బందితో చేతులు కలిపి వడ్డీ కట్టలేని వారి అవసరాలను ఆసరాగా తీసుకుని సమయం దాటిన అనంతరం బడా బాబులకే అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. లేదంటే వడ్డీ చెల్లించని వారిని టార్గెట్ చేస్తూ నోటీసులు అందిస్తారు. అలా అందించిన నోటీసులకు సమాధానం లేకుంటే ఇక అంతే. బంగారం మాయమైనట్టే. బాధితులు ఫైనాన్స్ సంస్థ సిబ్బందిని సమయం కావాలని బ్రతిమిలాడుకుంటే సంబంధిత బంగారు వ్యాపారి బడా బాబు వద్దకు పంపించి ఆయన వద్ద డబ్బులు అప్పు రూపేణా తీసుకుని ఫైనాన్స్ సంస్థలో చెల్లించి తిరిగి బంగారు వస్తువును ఆ యజమానికి అప్పగిస్తే అందులో వాటా సిబ్బందికి, లాభం బడా బాబుకు చెందేలా సన్నాహాలు చేస్తూ పన్నాగాలు పన్నుతూ సామాన్యులను మోసం చేస్తున్నారని సమాచారం. రూల్ ప్రకారం కుడవపెట్టిన బంగారు వస్తువు వడ్డీ కట్టలేక సమయం దాటితే సంబంధిత ఫైనాన్స్ సంస్థ నుండీ నోటీసులు జారీ చేసి అనంతరం పత్రిక ప్రకటన తో టెండర్ దారులను పిలవాల్సి ఉంటుంది. కానీ అక్కడ అలా జరగదని తెలుస్తుంది. ఎందుకంటే ఏకంగా ఓ బడా వ్యాపారికి అంటగట్టి సొమ్ము చేసుకోవటం సిబ్బందికి అలవాటుగా మారిందని చెప్పొచ్చు.

**నోటీసు సమయం దాటక ముందే**

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల తీరు ఎలా ఉందంటే పిల్ల పుట్టకముందే కుళ్ళ కొట్టినట్టు బంగారు వస్తువు కుడవపెట్టిన వారికి వడ్డీ చెల్లించలేని పక్షంలో నోటీసులు అందిస్తారు. అందించినప్పటికి నోటీసు సమయం దాటక మునుపే బంగారు వస్తువు అమ్మేయడం జరుగుతుందని కొందరు బాధితులు వాపోయారు. వడ్డీ చెల్లించని వారి పరిస్థితి ఇలా ఉంటే పైసా పైసా పోగేసి ఆశతో కొనుగోలు చేసిన బంగారు వస్తువు సమాచారం అందించకుండానే విక్రయించటంతో సిబ్బంది పై బాధితులు మండిపడుతున్నారు.

**ఫైనాన్స్ సంస్థల పై బడా బాబుల పెత్తనం**

ఫైనాన్స్ సంస్థలు బంగారం కుడవపెట్టుకుని వడ్డీ కట్టించుకుంటే అవే సంస్థలు బంగారు వ్యాపారి బడా బాబుల తో కుమ్మక్కై పేద ప్రజల బంగారాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు ఇందుకు పేరు గాంచిన సంస్థ సిబ్బంది కి అన్ని విధాలా సపర్యలు మర్యాదలు పారితోషకాలు మరోటి మరోటి అన్ని అందచేస్తూ మచ్చిక చేసుకుంటున్నట్టు తెల్సింది. ఇలా అక్రమాలకు పాల్పడుతూ పేరున్న ఫైనాన్స్ సంస్థల పరువు తీస్తూ పేదల సొమ్ము కాజేస్తూ సంస్థ పై పేద ప్రజలకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారు కండీషన్స్ అప్లై అనే సంస్థలు వారికి ఎలాంటి కండీషన్ లతో సంబంధం లేదన్నట్టు ప్రవర్తించటం వ్యాపారులతో చేతులు కలిపి ఒక్కరికే బంగారు వస్తువులు అంటగట్టడం చేస్తూ సంస్థ ల పరువు తీస్తున్న సిబ్బంది పై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూద్దాం.

**ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై 'వైకుంఠ'పాళి**
**వివరాలు : వచ్చే సంచికలో**

# వందేమాతరం చరణాల గీతాలాపన వ్యక్తిగత నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.



కృష్ణ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎస్. మురళీధర్ వాదనలు వినిపిస్తూ.. ఆరు చరణాలలో నాలుగు చరణాలు స్పష్టంగా హిందూ దేవతలపై భక్తిని ప్రకటిస్తాయని, వాటిని పాడాలని నిర్బంధించడం రాజ్యాంగ లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ సవరణ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉందని, 'మెజారిటీ మతపరమైన సందేశాన్ని' ప్రోత్సహిస్తోందని వాదించారు. 'వారు 'జాతీయ గేయం' అనే పదాన్ని ప్రవేశపెట్టారు కానీ, అసలు నేషనల్ సాంగ్ అంటే ఏమిటో చట్టంలో నిర్వచించలేదు. గెజెట్‌లో కూడా ప్రచురించలేదు.. వారు ఏ చట్టపరమైన నిబంధననూ ఉదహరించడం లేదు" అని మురళీధర్ కోర్టుకు విన్నవించారు.

# ఖాకీల వేషంలో కామాంధులు

(మొదటి పేజీ తరువాయి)

కేసు పెడతామని బెదిరించినట్లు బాలిక వాంగ్మూలంలో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలికను స్నేహితుడి నుంచి వేరు చేసి పార్కులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఈ ఘటనపై రాత్రి 8.45 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించారు. పోక్సో, బీఎన్ఎస్‌లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పార్కు, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చేపట్టగా.. అమర్ కాలనీ ప్రాంతంలో ఆసిఫ్‌ను పోలీసులు గుర్తించారు. లొంగిపోవాలని కోరినప్పటికీ అతడు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఓ హెడ్ కానిస్టేబుల్ బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్‌కు తూటా తగలడంతో, పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆసిఫ్ కుడి కాలికి బుల్లెట్ గాయమైంది. అనంతరం అతడిని ఆసుపత్రికి తరలించి అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతోంది. రాజధాని ఢిల్లీలో కేవలం 10 రోజుల వ్యవధిలో మైనర్ బాలికలపై జరిగిన నాలుగో లైంగిక దాడి ఘటన కావడం గమనార్హం.

# నదిలో కొట్టుకుపోయిన ఏనుగుపిల్ల...

- **ప్రాణాలకు తెగించి కాపాడిన జాలర్లు**
- **3 కిలోమీటర్లు పడవపై వెళ్లి మరీ రెస్క్యూ**
- **ఆపై తల్లి వద్దకు సురక్షితంగా చేర్చిన అటవీ అధికారులు**

**పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే ఒక అద్భుత ఘట్టం చోటుచేసుకుంది. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న నదీ ప్రవాహంలో కొట్టుకుపోతూ మృత్యువుతో పోరాడుతున్న ఒక చిన్న ఏనుగు పిల్లను ఇద్దరు జాలర్లు ప్రాణాలకు తెగించి కాపాడిన తీరు అందరి హృదయాలను ద్రవీభవింపజేస్తోంది. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి, నెటిజన్ల మనసులను గెలుచుకుంటున్నాయి.

పశ్చిమ బెంగాల్‌లోని మాల్‌బజార్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న తీస్తా నదిలోని స్పర్ నంబర్ 12 వద్ద ఈ ఉత్కంఠభరిత సంఘటన జరిగింది. రోజూలాగే ఇద్దరు స్థానిక మత్స్యకారులు తమ పడవపై నదిలో వేటకు వెళ్లారు. అదే సమయంలో తీస్తా నదిలో నీటి ఉద్ధృతి చాలా తీవ్రంగా ఉంది. ఈ క్రమంలోనే ఒక చిన్న ఏనుగు పిల్ల నీటి ప్రవాహ హోరుకు తట్టుకోలేక కొట్టుకుపోతూ.. మునిగుతూ, తేలుతూ ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతుండటాన్ని ఆ జాలర్లు గమనించారు. అంతే.. ఆ మూగజీవి పడుతున్న వేదనను చూసి ఆ మత్స్యకారులు క్షణం కూడా ఆలస్యం చేయలేదు.



తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా.. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నీటిలో తమ పడవను ఆ ఏనుగు పిల్ల ఉన్న దిశగా తిప్పారు. వేగంగా ప్రవహిస్తున్న తీస్తా నదిలో దాదాపు మూడు కిలో మీటర్ల మేర ఆ పిల్లను వెంబడిస్తూ సాహసయాత్ర చేశారు. ఎట్టకేలకు దానిని సమీపించి, సురక్షితంగా తమ పడవలోకి లాక్కోగలిగారు. ఏనుగు పిల్లను నది నుంచి ఒడ్డుకు చేర్చిన తర్వాత ఆ జాలర్లు చూపించిన ప్రేమ, ఆప్యాయత అద్భుతం. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నాక.. భయంతో వణికిపోతున్న ఆ బుల్లి ఏనుగును సదరు మత్స్యకారులు గట్టిగా హత్తుకుని.. దానికి వెచ్చదనాన్ని, ధైర్యాన్ని అందించారు. పడవలో బుల్లి ఏనుగు పిల్లను హత్తుకున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండగా.. నెటిజన్లు ఆ దృశ్యాలను చూసి ఆనంద భాష్పాలు కారుస్తున్నారు.

సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని ఏనుగు పిల్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ ఏనుగు పిల్లను సమీపంలోనే ఉన్న దాని తల్లి వద్దకు సురక్షితంగా చేర్చడంతో కథ సుఖాంతమైంది.

# ఓయోలో యువతి అనుమానాస్పద మృతి

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు హోటల్ గదిని పరిశీలించిన పోలీసులకు గోడలు, బెడ్‌షీట్‌పై రక్తపు మరకలు గుర్తించారు. గదిలో ఖాళీ బీర్, విస్కీ బాటిళ్లు కూడా లభించాయి. దీంతో ఘటనకు ముందు గదిలో ఏం జరిగిందనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. మద్యం సేవించారా ? ఇద్దరి మధ్య ఏదైనా వివాదం జరిగిందా ? యువతిపై దాడి జరిగిందా ? అనే కోణాల్లో ఆధారాలను సేకరిస్తున్నారు. యువతి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించిన అనంతరం ఆమెతో పాటు వచ్చిన శ్రీనివాస రవి తేజ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. అతడి కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. అతడి మొబైల్ ఫోన్ చివరి లొకేషన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో గుర్తించినట్లు తెలిసింది. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు సమాచారం.

# కారు ఢీకొని యాచకురాలు మృతి..

(మొదటి పేజీ తరువాయి)

ఆలయ పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించడంతో పాటు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈశ్వరమ్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై దర్యాప్తు పూర్తి అయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు.

# ముగ్గురు పసికందులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

సరఫరాను నిలిపివేశారు. అనంతరం వార్డులో ఉన్న చిన్నారులను సురక్షితంగా పక్క వార్డుకు తరలించే చర్యలు చేపట్టారు. అయితే ఈ ఘటనలో ముగ్గురు పసి పిల్లలు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదం కారణంగా అస్వస్థతకు గురైన మిగతా చిన్నారులను మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారిలో మరికొందరు శిశువుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.



ప్రమాదం సమయంలో ఒక్కసారిగా పొగలు కమ్ముకోవడంతో వార్డులో తీవ్ర గందరగోళం నెలకొంది. నవజాత శిశువులు ఉన్న విభాగంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవటంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఘటన విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ రాజర్షి షా రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి, చిన్నారులకు అందుతున్న వైద్యం, భద్రతా చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గాయపడిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ప్రస్తుతం చిన్నారులకు మెరుగైన వైద్యం అందుతుండగా.. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**ఏసీలు ఎందుకు పేలుతాయి..?**

ఎయిర్ కండీషనర్లు పేలిపోవడానికి ప్రధాన కారణం సరైన నిర్వహణ లేకపోవడం, నాసిరకం పరికరాలను ఉపయోగించడమేనని నిపుణులు చెబుతున్నారు. సుదీర్ఘకాలం పనిచేయడం వల్ల కంప్రెసర్ తీవ్రంగా వేడెక్కడమే కాకుండా.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, నాసిరకం వైరింగ్ వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతాయని అంటున్నారు. అలాగే, గ్యాస్ లీకేజీలు ఉన్నప్పుడు ఎలక్ట్రిక్ స్పార్క్ తగిలితే ప్రమాదం మరింత తీవ్రమవుతుందని.. ఏసీ అవుట్‌డోర్ యూనిట్లలో ధూళి చేరిపోవడం, సరైన గాలి వెళ్లే మార్గం లేకపోవడం కూడా వేడిని పెంచి పేలుళ్లకు దారితీస్తాయని చెబుతున్నారు.

# 102 మంది 'యువ ఆపద మిత్ర' వాలంటీర్లకు శిక్షణా పత్రాలు


**అందజేసిన కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు**



**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** వరంగల్ మామునూరులోని 4వ బెటాలియన్ ఆవరణలో గత 7 రోజులుగా నిర్వహించిన 'యువ ఆపద మిత్ర' శిక్షణా కార్యక్రమం మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణా కార్యక్రమాన్ని అధికారికంగా ముగించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విపత్తులు, అత్యవసర పరిస్థితులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో 'ఆపద మిత్ర'ల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. 7 రోజుల పాటు సాగిన ఈ కఠినమైన శిక్షణలో విపత్తు నిర్వహణ, ప్రథమ చికిత్స, సహాయక చర్యలపై వాలంటీర్లకు పూర్తి అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. యువత ఇటువంటి శిక్షణను సద్వినియోగం చేసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 102 మంది యువ వాలంటీర్లకు కమాండెంట్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లు) అందజేశారు. విపత్తు సమయాల్లో తక్షణమే స్పందించి బాధితులను ఆదుకునేలా వాలంటీర్లు సిద్ధంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జె. రాజేందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్స్ కార్తీక్,రవి,రాజ్ కుమార్,రాంప్రసాద్ బెటాలియన్ అధికారులు,శిక్షకులు మరియు యువ ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

# యువతి అదృశ్యం

## కేసు నమోదు చేసిన పోలీసులు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** భీమదేవరపల్లి మండలం కొత్తపెల్లి గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి సౌజన్య (19) అనే యువతి అదృశ్యమైనట్లు ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం... సెప్టెంబర్ 21న రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసిన అనంతరం సౌజన్య ఇంట్లో నిద్రపోయింది. అర్ధరాత్రి సుమారు 1:00 గంటల ప్రాంతంలో ఆమె తల్లి బొమ్మిశెట్టి స్వప్న నిద్రలేచి చూడగా సౌజన్య కనిపించలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల,బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. తల్లి స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు భీమదేవరపల్లి ఎస్సై రాజు తెలిపారు.

## మైనారిటీ పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు, టీకాల పంపిణీ




**హసన్ పర్తి, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల బాయ్స్-1 హన్మకొండ లో విద్యార్థులకు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ 15న 16 ఏళ్ల విద్యార్థులకు, సెప్టెంబర్ 22న 10 ఏళ్ల విద్యార్థులకు టీడీ బూస్టర్ డోస్ టీకాలు వేశారు. యూపీహెచ్‌సీ పెద్దమ్మగడ్డ వైద్యాధికారి విజయ, సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్యం, కాలానుగుణ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారులు దుర్గాప్రసాద్, స్నేహ, సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పుల్లరి మురళి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముల్కనూర్‌లో మహా అన్నదాన కార్యక్రమం



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** గణపతి నవరాత్రులలో భాగంగా ముల్కనూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం దేవస్థానం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముల్కనూర్ ఎస్సై రాజు హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ జక్కుల మల్లికార్జున్, వైస్ చైర్మన్ గిరబోయిన కుమారస్వామి,మాజీ చైర్మన్ జక్కుల ప్రకాశం, యాదవ సంఘం కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పంపు డ్రైవర్‌పై దాడి యత్నం..
### చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



**భీమదేవరపల్లి:సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** గ్రామంలో తాగునీటి సరఫరా విధులు నిర్వహిస్తున్న పంపు డ్రైవర్‌పై దూషణలకు దిగడంతో పాటు దాడికి యత్నించిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్‌లో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాంనగర్ గ్రామంలో పంపు డ్రైవర్‌గా పనిచేస్తున్న వీరయ్య మంగళవారం ఉదయం గ్రామంలో నల్లాలు తిప్పుతూ విధులు నిర్వహిస్తుండగా, తండాకు చెందిన భూక్యా రాజేందర్ తనను దూషిస్తూ కొట్టేందుకు వచ్చాడని వీరయ్య ఆరోపించారు. దీంతో భయాందోళనకు గురైన ఆయన వంగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విధుల్లో ఉన్న తనపై దాడికి యత్నించిన వ్యక్తిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను కోరారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

## ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలి

### సైదాపూర్ ఎస్సై కొప్పుల స్వాతి



**సైదాపూర్ సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సైదాపూర్ ఎస్సై కొప్పుల స్వాతి సైదాపూర్ మండల గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిమజ్జన సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, అందరూ క్షేమంగా ఇళ్లకు చేరేలా పోలీస్ శాఖ తరఫున పలు కీలక సూచనలు జారీ చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి గొడవలకు తావులేకుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో పూర్తి చేయాలన్నారు. అధిక శబ్దాల వల్ల చెవుల సమస్యలు, తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. గతంలో శబ్ద కాలుష్యం వల్ల ఘర్షణలు జరిగి కేసులు నమోదు కావడమే కాకుండా ప్రాణనష్టం జరిగిన ఘటనలు కూడా ఉన్నాయని, కాబట్టి పరిమిత శబ్దంతో వేడుకలు జరుపుకోవాలని స్పష్టం చేశారు. వెలుతురు ఉన్న సమయంలోనే నిమజ్జన ప్రక్రియను పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. నీటి వద్దకు వెళ్లేటప్పుడు ప్రతీ ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి.

పిల్లలు, యువత ఉత్సాహంతో నీటి లోతుల్లోకి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలి.గణేష్ మండప నిర్వాహకులు నిమజ్జన ఊరేగింపును క్రమశిక్షణతో ముందుండి నడిపించాలి. ప్రజలందరూ క్షేమంగా, ఆరోగ్యంగా ఇళ్లకు చేరుకోవడమే పోలీస్ శాఖ ప్రాథమిక ఉద్దేశం. అందరం కలిసికట్టుగా భక్తితో జరుపుకుందాం.. జాగ్రత్తగా నిమజ్జనం చేద్దాం.. సురక్షితంగా ఇంటికి చేరుకుందాం అని ఎస్ఐ కొప్పుల స్వాతి పిలుపునిచ్చారు.

## పెర్కపల్లి హనుమాన్ దేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం



**సైదాపూర్ సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** గణపతి నవరాత్రులలో భాగంగా సైదాపూర్ మండలం పెరిక పల్లి భక్తాంజనేయ దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం దేవస్థానం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భక్తాంజనేయ కమిటీ సభ్యులు తిప్పని రాజయ్య, తిప్పని దేవేందర్, చిమ్మని మల్లేష్, దేవయ్య , సురేష్ , అకిల్, కనకయ్య, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# సీఎం రేవంత్ డైవర్షన్ సూత్రధారి.... కపట నాటక పాత్రధారి

- బీఆర్ఎస్ అగ్రనేతల భూముల వద్దకు కాంగ్రెస్ నాయకుల యాత్రలు గోబెల్స్ గేమ్
- ఇదంతా ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ రెడ్డి చేస్తున్న బ్లేమ్
- దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉంది కాంగ్రెస్ వ్యవహార శైలి...
- 22ఏ లో భూములు పెట్టి లక్షలాది మందికి నరకం చూపిస్తున్న రేవంత్ ఫాసిస్ట్ సర్కార్.
- అసెంబ్లీలో కాంగ్రెస్ బండారం బయట పడుతుందనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులతో అక్రమ దాడి
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి



ఆర్మూర్,(పీపుల్స్ డైరీ)హైదరాబాద్ : ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నేతలపై పదేపదే బురద చల్లుతున్న సీఎం రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్ సూత్రధారి అని, కాంగ్రెస్ రక్తికట్టిస్తున్న కపట నాటక పాత్రధారి అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలనే కాదు, ముక్కోటి దేవుళ్ళను కూడా మోసం చేస్తున్న పచ్చి అబద్దాల కోరు సీఎం రేవంత్ రెడ్డి అని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలకు చెందిన ఫామ్ హౌస్ ల వద్దకు భూముల పరిశీలన పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న యాత్రలు రేవంత్ రెడ్డి రూపకల్పన చేసిన ఒక గోబెల్స్ గేమ్ అని, ఇదంతా ప్రజల దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న బ్లేమ్ అని ఆయన మండిపడ్డారు. దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉంది కాంగ్రెస్ వ్యవహార శైలి అని ఆయన విమర్శించారు.

22ఏ లో భూములు పెట్టి లక్షలాది మందికి నరకం చూపిస్తున్న రేవంత్ ఫాసిస్ట్ సర్కార్ పేక మేడలా కూలి పోతుందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ బండారం బయట పడుతుందనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులతో అక్రమ దాడి చేయించి చితక బాదించారని, మహిళా ఎమ్మెల్యేలను అవమాన పర్చారని జీవన్ రెడ్డి ఆరోపించారు. శాసనసభను గౌరవ సభలా కాకుండా కౌరవ సభలా మార్చి అభినవ దుశ్శాసన పర్వానికి శ్రీకారం చుట్టారని ఆయన వ్యాఖ్యానించారు. అకారణంగా సస్పెన్షన్ చేసి అసెంబ్లీకి రాకుండా బీ ఆర్ఎస్ సభ్యులపై కుట్ర చేశారని ఆయన వెల్లడించారు. ఈ పరిణామాలను చూసి సర్కార్ తీరుపై ఉమ్మేస్తున్న ప్రజల దృష్టి మళ్లించేందుకు కేసీఆర్ ఫ్యామిలీపై భూముల కబ్జా ఆరోపణలు తెరపైకి తెచ్చారని జీవన్ రెడ్డి దుయ్యబట్టారు. ఒక చిన్న తప్పు ఉన్నా తన కష్టార్జితమైన 13 ఎకరాల భూమి ప్రభుత్వానికే రాసిచ్చేస్తా అని హరీష్ రావు చేసిన సవాల్ ను స్వీకరించే దమ్ము ప్రభుత్వానికి లేదా? అని ఆయన నిలదీశారు.

దళితుల భూములను కేసీఆర్ కబ్జా చేయలేదని తేలితే సీఎం రేవంత్, మంత్రులు రాజీనామాకు సిద్ధమా? అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ ఫ్యామిలీపై రాజకీయ కక్షసాధింపు యాత్రలు కాంగ్రెస్ దమననీతికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌లో బీ ఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడుతామని, కాంగ్రెస్ పగబట్టి దండయాత్రలు చేసినా, అక్రమ కేసులు పెట్టి బురద రాజకీయాలు చేసినా వదిలిపెట్టేది లేదని గులాబీ సైన్యం పోరాటం ఎప్పుడూ ప్రజల పక్షమేనని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

## పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర కుష్టు నివారణ బృందం





రేగొండ, సెప్టెంబర్ 22 (పీపుల్స్‌డైరీ) : రేగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కుష్టు నివారణ బృందం మంగళవారం సందర్శించింది. జిల్లాలో కుష్టు వ్యాధి (లెప్రసీ) నిర్మూలనే లక్ష్యంగా వైద్య సిబ్బందికి అవగాహన కల్పించేందుకు మరియు క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించరు..

చెంగల్పట్టు లోని సెంట్రల్ లెప్రసీ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డా. వీరకుమారన్ నేతృత్వంలోని కేంద్ర బృందం రేగొండ ఆరోగ్య కేంద్రానికి విచ్చేసి కుష్టు వ్యాధి నియంత్రణ, కేసుల గుర్తింపు మరియు చికిత్స పై సమీక్ష నిర్వహించారు.

రేగొండ ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో వైద్యులు, సూపర్వైజర్లు, ఆశా వర్కర్లు, మరియు హెల్త్ అసిస్టెంట్లకు కుష్టు వ్యాధి గుర్తింపుపై అవగాహన కల్పించారు. కుష్టు లక్షణాలపై . డా, వీరకుమారన్ మాట్లాడుతూ చర్మంపై నూనె రాసినట్లు మెరిసే లేత రంగు లేదా రాగి రంగు మచ్చలు ఏర్పడటం, ఆ మచ్చలపై స్పర్శ (స్పర్శ జ్ఞానం) లేకపోవడం వంటి ప్రాథమిక లక్షణాలను గుర్తించాలని సూచించారు. ఇలాంటి వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే రోగులను సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి సంప్రదించేలా సిబ్బంది ప్రజల్లో చైతన్యం తేవాలని స్పష్టం చేశారు.

ఆరోగ్య కేంద్రానికి పరిధిలో గత సంవత్సరం నమోదైన కుష్టు కేసుల రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. కుష్టు లక్షణాలపై నివారణ చర్యలుపై అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.

కొత్త కేసుల కాంటాక్ట్ ట్రేసింగ్, కుటుంబ సభ్యుల పరీక్ష, వైకల్య నివారణ చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

కేంద్ర బృందం రేగొండ ఆరోగ్య కేంద్రాశీలో అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, ఫీల్డ్ సిబ్బంది పనితీరును అభినందించారు.

ఈ కార్యక్రమంలో డా,హేమా బిందు ,సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా, రాజు కుష్టు వ్యాధి అధికారి డా,సందీప్ , జిల్లా ఆరోగ్య కేంద్రం కార్యాలయ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, ఏ ఎన్ ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.

## మామునూరు విమానాశ్రయానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలి

### తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్

**భీమదేవరపల్లి సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ జిల్లా మామునూరులో నిర్మించనున్న విమానాశ్రయానికి భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విమానాశ్రయానికి "భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విమానాశ్రయం"గా నామకరణం చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. విద్య, సామాజిక న్యాయం, మహిళల హక్కులు, కార్మికుల హక్కులు, ప్రజాస్వామ్యం, సమానత్వం వంటి అంశాల కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు.

చారిత్రకంగా వరంగల్ నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, కాకతీయుల కాలంలో వరంగల్ రాజధానిగా వెలుగొందిందని ప్రకాష్ తెలిపారు. వరంగల్-హనుమకొండ-కాజీపేట ప్రాంతం తెలంగాణలో కీలకమైన నగర సముదాయంగా అభివృద్ధి చెందుతోందని, భవిష్యత్తులో ఈ ప్రాంతం మరింత ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉందన్నారు.

అంబేద్కర్ ఆలోచనా విధానం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం భవిష్యత్ తరాలకు కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. మామునూరు విమానాశ్రయానికి "భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విమానాశ్రయం" అనే పేరు పెట్టే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ తరఫున కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తొందూరి ఎల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాక రమేష్, వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## కత్తులతో దాడి కేసులో నలుగురు అరెస్ట్

కరకగూడెం, సెప్టెంబర్ 22 (పీపుల్స్‌డైరీ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం అశ్వాపురంపాడు గ్రామ శివారులోని ఫారెస్ట్ ప్లాంటేషన్ వద్ద ఈ నెల 19న వజ్జా భీమరాజుపై కత్తులతో దాడి చేసిన కేసులో నలుగురు నిందితులను కరకగూడెం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. అశ్వాపురంపాడు గ్రామానికి చెందిన వజ్జా భీమరాజు పశువులను మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లగా, నిందితులు అతడిని వెంబడించి కత్తులతో మెడ, తలపై విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కోవాసి బాలకృష్ణ (వెంకటేశ్వర్లు కుమారుడు), పోడియం విజయ్ (అడమయ్య కుమారుడు), కోవాసి సంతోష్ (జోగయ్య కుమారుడు), పోడియం మంగయ్య (ఉంగయ్య కుమారుడు)గా పోలీసులు తెలిపారు.

పోలీసుల విచారణలో.. మొదటి నిందితుడైన కోవాసి బాలకృష్ణ తండ్రి వెంకటేశ్వర్లు గతంలో హత్యకు గురయ్యాడని, ఆ హత్యకు భీమరాజే కారణమని నిందితులు భావించినట్లు వెల్లడైంది. ఈ కేసులో జైలు నుంచి విడుదలైన అనంతరం భీమరాజుపై ప్రతీకారం తీర్చుకోవాలని నలుగురు నిందితులు పథకం వేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే భీమరాజు అటవీ ప్రాంతానికి వెళ్లిన సమయంలో అతడిపై కత్తులతో దాడి చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో ఏడూళ్ల బయ్యారం సీఐ వి. వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావుతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# రిమ్స్‌లో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి

- రాష్ట్ర ప్రభుత్వం సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి
- బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్

**సైదాపూర్ సెప్టెంబర్ 22 ( పీపుల్స్ డైరీ)** కరీంనగర్ జిల్లా కేంద్రంలో బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ విలేకరులతో మాట్లాడుతూ నిన్న అర్ధరాత్రి అదిలాబాద్ జిల్లా కేంద్రం లోని రిమ్స్ ఆస్పత్రిలో అర్ధరాత్రి ఏసి యూనిట్ పేలి సంబంధించిన అగ్ని ప్రమాదం ఘటనపై బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు అగ్ని ప్రమాదంలో ముగ్గురు చిన్నారి శిశువులు మృతి చెందడం తనను తీవ్రంగా కలిసివేసిందని ఆయన పేర్కొన్నారు మిగతా చికిత్స పొందుతున్న 23 మంది చిన్నారులకు నాణ్యమైన వైద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించాలని ఆయన అన్నారు ఇంత పెద్ద ఆసుపత్రికి ఒకే డ్యూటీ డాక్టర్ ఉంటారా ఆరోగ్య శాఖ మంత్రి గారు డాక్టర్ల నియామకం చేపట్టండి అని ఆయన పేర్కొన్నారు జరిగిన సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వ ఆసుపత్రిలో సరియైన నాణ్యమైన పరికరాలు కొనుగోలు నాణ్యత పాటించకపోవడం వల్ల చిన్నారి పసి మొగ్గలు ఈ సంఘటనలో చనిపోవడం చాలా బాధాకరమని ఆయన పేర్కొన్నారు తల్లిదండ్రులకడుపు కోత ఎవరు తీరుస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ప్రభుత్వం చిన్నారుల మృతి చెందిన పట్ల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు తక్షణమే ఆర్థిక సహాయాన్ని చేయాలని ఆయన ప్రభుత్వాన్ని వేడుకున్నారు అలాగనే ఆ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన అన్నారు రాష్ట్రములో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు ఇలా ఉందో ప్రభుత్వానికి తెలియడం లేదా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు పేద బడుగు బలహీన వర్గాల ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకుంటారు అందుకే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు ఏసీ పరికరాలు కొనుగోళ్లప్పుడు నాణ్యత పాటించలేదని అందుకే ప్రమాదం జరిగిందని కాబట్టి సమగ్రంగా విచారణ జరిపి సంబంధించిన అధికారులపై చర్య తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఈ చిన్నారి పసి మొగ్గలు రేపటి భావి భారత పౌరులు చనిపోవడం చాలా బాధాకరమని బాలల హక్కుల ప్రజావేదిక వారి కుటుంబానికి దేవుడు మనోదర్యాన్ని బాధను తట్టుకునే విధంగా ప్రసాదించాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్టు ఆయన అన్నారు రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగు కోసం ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించి చక్కదిద్దాలని రాష్ట్ర ప్రియతమ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి గారిని ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజనరసింహ గారిని కోరుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.



# పీపుల్స్ డైరీ

వరంగల్

బుధవారం, 23 సెప్టెంబర్ 2026

సంపుటి : 18, సంచిక : 188




## శ్రీ ఆదిముక్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు..



భూపాలపల్లి సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) : శ్రీ ఆదిముక్తీశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు కాళేశ్వరం విచ్చేసిన రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పి సంకీర్త్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ ధార్మిక సలహాదారు గోవిందహరి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య శ్రీ ఆదిముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించగా, మంత్రి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం బాలాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.

ఈ కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పి సెరిశెట్టి సంకీర్త్, అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర సభ్యులు దండు రమేష్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, కాటారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పంతగాని తిరుమల, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి, దేవస్థానం డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతి రాజ్, విద్యుత్, ఆర్ అండ్ బి, ప్రణాళిక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలి..

### అధికారులతో మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష

భూపాలపల్లి సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేసి, వచ్చే ఏప్రిల్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరంలోని దేవస్థానం ఈవో కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ, పోలీస్, అటవీ, దేవాదాయ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, పీఆర్, విద్యుత్తు, ఆర్ డబ్ల్యూ ఎస్, ఆర్టీసీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా రాజీపడరాదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,000 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని పుష్కరాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్, ధార్మిక సలహాదారు గోవింద హరి, అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ దండు రమేష్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, దేవాలయ శిల్పి స్థపతి బాలసుబ్రహ్మణ్యం, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, కాటారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పంతగాని తిరుమల, సింగిల్ విండో చైర్మన్ తిరుపతి రెడ్డి, దేవస్థానం డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, దేవాదాయ, ఇరిగేషన్, పంచాయతి రాజ్, విద్యుత్, ఆర్ అండ్ బి, ప్రణాళిక, ఆర్కి టెక్చర్ సూర్య నారాయణ మూర్తి, సర్పంచ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## వరంగల్ విమానాశ్రయానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలి..

- సామాజిక కార్యకర్త, కంటస్టేడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లకి విజ్ఞప్తి

**భీమదేవరపల్లి సెప్టెంబర్ 23 (పీపుల్స్ డైరీ) :** చారిత్రాత్మకమైన వరంగల్ లో త్వరలో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి.భారత మాజీ ప్రధాని,భారతరత్న పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సామాజిక కార్యకర్త, కంటస్టేడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లకి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్రంలోని రెండవ పెద్ద నగరం అయిన వరంగల్ పూర్వకాలంలో కాకతీయుల రాష్ట్ర రాజధానిగా పేరు ప్రతిష్టలు పొందినది. ప్రపంచంలో గొప్ప విద్యావిత్తగా విశ్వవిజ్ఞానిగా బాహుబషా కోవిదుడు ఆర్థిక సంస్కరణలు, భూసంస్కరణల రూపశిల్పిగా ప్రపంచ స్థాయిలో పేరు ప్రతిష్టలు పొందిన పీవీ నరసింహారావు యొక్క పేరును ప్రపంచ స్థాయి హంగులతో సౌకర్యాలతో ప్రపంచ స్థాయి పర్యటకులను ఆకర్షించే విధంగా రూపుదిద్దుకుంటున్న వరంగల్ లోని



మామునూరులో నిర్మిస్తున్న విమానాశ్రయానికి పీవీ నరసింహారావు పేరు పెట్టవలసిన అవసరం ఎంతైన ఉంది.వరంగల్ లో నిర్మించే విమానాశ్రయంలో పీవీ విగ్రహాన్ని ప్రతిష్టించి పీవీ యొక్క జీవిత చరిత్రను తాను రాసిన పుస్తకాలను. పరిశోధనలను ఒక లైబ్రరీ ఏర్పాటు చేసి విమాన ప్రయాణికులు ఉపయోగించుకునే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలి,అందుకోసం కొన్ని నిధులను అధికంగా కేటాయించాలి.పీవీ నరసింహారావు యొక్క విశిష్టతను తన గొప్పతనం ప్రపంచ స్థాయిలో తెలియజేయాలని మనవి చేయుచున్నాము. అధికారులు. ప్రజాప్రతినిధులు తనను ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తి పొందిన ప్రతి పౌరుడు విమానాశ్రయానికి పీవీ నరసింహారావు పేరు పెట్టడానికి కోసం ఐక్యతతో ప్రతిపాదించాలని మనవి చేయుచున్నాము.ఈకార్యక్రమంలో పీవీ నరసింహారావు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ నూతన మండల సమీక్ష సమావేశం



**కమలాపూర్ సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** కమలాపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన మండల, గ్రామ అధ్యక్షుల మండల సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఎజెండా అంశాలు సంపూర్ణ మద్యపాన నిషేధం కొరకు అక్టోబర్ రెండు న జరిగే మహిళలతో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా విజయవంతం చేయలని అక్టోబర్ ఏడున అమరావతిలో జరిగే నూతన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయలని కమాలపూర్ మండల సమావేశానికి సభాధ్యక్షులుగా ఎం.ఆర్.పి.ఎస్ మండల అధ్యక్షులు గోల్కొండ శ్రీకాంత్ మాదిగ,ముఖ్య అతిథులుగా ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, హనుమకొండ జిల్లా ఇంచార్జ్ తడుగుల విజయ్ మాదిగ, హనుమకొండ జిల్లా కో ఇన్చార్జ్ శనిగరపు రవిందర్ మాదిగ, మండల ఇంచార్జ్ లు సదస్సును ఉద్దేశించి మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.పి మండల అధ్యక్షులు శనిగరపు చెరాలు మాదిగ, ఎం ఆర్ పి ఎస్ మండల అధికార ప్రతినిధి పులా రవితేజ మాదిగ, ఎం.ఎస్.పిమండల అధికార ప్రతినిధి కుమ్మరి ఎలియ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి సీనియర్ నాయకులు జేరిపోతుల బిక్షపతి, ఆకిన పెల్లి రమేష్, ఆకినపల్లి రామ్మూర్తి, పూర్ణచందర్, నదునూరు ప్రసాద్, రత్న రాజేష్, గుంపుల జైపాల్, ఆకినపల్లి సారయ్య, ఆకిన పెల్లి రవీందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## ఘనుక్లలో భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి వేడుకలు

### ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎస్సై ఆవుల తిరుపతి



**వీణవంక సెప్టెంబర్ 23( పీపుల్స్ డైరీ)** ఘనుక్ల గ్రామంలోని శ్రీ భవానిశంకర స్వామి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎస్సై ఆవుల తిరుపతి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు, మహిళలతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ఆవుల తిరుపతి మాట్లాడుతూ, గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు జరగకుండా చూసుకోవాలని భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని వారు కోరారు. యువత నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని వారు తెలిపారు.

ఆలయ చైర్మన్ జిన్నారపు శివకుమార్ మాట్లాడుతూ, గణపతి నవరాత్రి ఉత్సవాలను గ్రామ ప్రజల సహకారంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అందరి సహకారంతో ప్రశాంతంగా నిర్వహిస్తామని వారు అన్నారు.

గ్రామ సర్పంచ్ గాజుల శంకర్ మాట్లాడుతూ, గణపతి నవరాత్రి ఉత్సవాల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు.ఈ నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జిన్నారపు శివకుమార్, గ్రామ సర్పంచ్ గాజుల శంకర్, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం జరుపుకోవాలి

### కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి సూచనలు

**శంకరపట్నం సెప్టెంబర్:22 పీపుల్స్ డైరీ :** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి శంకరపట్నం మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిమజ్జన సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, అందరూ క్షేమంగా ఇళ్లకు చేరేలా పలు కీలక సూచనలు జారీ చేశారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి గొడవలకు తావులేకుండా, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో పూర్తి చేయాలన్నారు. అధిక శబ్దాల వల్ల చెవుల సమస్యలు, తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. గతంలో శబ్ద కాలుష్యం వల్ల ఘర్షణలు జరిగి కేసులు నమోదు కావడమే కాకుండా ప్రాణనష్టం జరిగిన ఘటనలు కూడా ఉన్నాయని, కాబట్టి పరిమిత శబ్దంతో వేడుకలు జరుపుకోవాలని స్పష్టం చేశారు. వెలుతురు ఉన్న సమయంలోనే నిమజ్జన ప్రక్రియను పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. నీటి వద్దకు వెళ్లేటప్పుడు ప్రతీ ఒక్కరూ తగిన



జాగ్రత్తలు పాటించాలి.

పిల్లలు, యువత ఉత్సాహంతో నీటి లోతుల్లోకి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలి.గణేష్ మండప నిర్వాహకులు నిమజ్జన ఊరేగింపును క్రమశిక్షణతో ముందుండి నడిపించాలి.

ప్రజలందరూ క్షేమంగా, ఆరోగ్యంగా ఇళ్లకు చేరుకోవడమే పోలీస్ శాఖ ప్రాథమిక ఉద్దేశం. అందరం కలిసికట్టుగా భక్తితో జరుపుకుందాం.. జాగ్రత్తగా నిమజ్జనం చేద్దాం.. సురక్షితంగా ఇంటికి చేరుకుందాం అని ఎస్ఐ శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## చర్లపల్లిలో సృజనాత్మకంగా 'వినాయక చవితి' పాఠం!

**చర్లపల్లి(నడికూడ) సెప్టెంబర్ 22 (పీపుల్స్‌డైరీ) :** పాఠ్యపుస్త కాలకే పరిమితం కాకుండా వినూ త్న రీతిలో విద్యార్థులకు పాఠ్యాం శాలను బోధించడం ద్వారా వారిలో ఆసక్తి తో పాటు విషయావగాహన పెరుగుతుందని ఎంపిపిఎస్ చర్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ నిరూపించారు. పాఠశాలలోని 4వ తరగతి విద్యార్థులకు ఆయన తెలుగు పాఠ్యపుస్తకంలోని 'వినాయక చవితి' పాఠాన్ని అత్యంత సృజనాత్మకంగా, ప్రాక్టికల్ పద్ధతిలో బోధించారు. ఈ బోధనా కార్యక్రమంలో భాగంగా మట్టి వినాయకుల తయారీ: పండగ ప్రాశస్త్యాన్ని వివరించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను తెలపడానికి విద్యార్థులతో స్వయంగా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. వినాయక చవితి విశిష్టతను, పూజా విధానాన్ని మరియు దానికి వెనుక ఉన్న పౌరాణిక కథలను విద్యార్థులకు ఆసక్తికరమైన కథన రూపంలో వివరించారు. బోధనలో భాగంగా విద్యార్థులు స్వయంగా ప్రతిమలను తయారు చేస్తూ, పండగ సంస్కృతి–సంప్రదాయాలను ఎంతో ఉత్సాహంగా తెలుసుకున్నారు.





ఈ సందర్భంగా హెచ్ఎం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ "పిల్లలకు కేవలం చదవడం, రాయడమే కాకుండా ప్రాక్టికల్ కార్యకలాపాల ద్వారా పాఠాలు చెప్పినప్పుడు అవి వారి మనసులో చిరస్థాయిగా నిలిచిపోతాయి. పర్యావరణహిత మట్టి గణపతులను వాడాలనే సందేశాన్ని కూడా విద్యార్థుల ద్వారా సమాజానికి అందించడమే మా ముఖ్య ఉద్దేశం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. నేర్చుకోవడాన్ని ఒక వేడుకలా మార్చిన హెచ్ఎం అచ్చ సుదర్శన్ వినూత్న బోధనా విధానాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పలువురు ప్రశంసించారు.

## కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలి

భూపాలపల్లి సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) : రాష్ట్రం లో కుష్టు వ్యాధి రహిత సమాజ స్థాపన దేయంగా వైద్య సిబ్బందితోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ ఉమ్మడిగా కృషి చేయాలని కేంద్ర కుష్టు వ్యాధి నివారణ బృందం పిలుపునిచ్చింది. రెండు రోజులపాటు ఈ బృందం జిల్లాలో పర్యటించనున్నది దేశంలోనే అత్యధికంగా కేసులు నమోదైనటువంటి జిల్లాగా జయశంకర్ భూపాలపల్లి రికార్డు స్థాయిలో ఉన్నది , జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులు మొత్తం 35 మంది ఉండగా 29 ఎంబి కేసులుగా 6 పి. బి కేసులుగా నమోదయి ఉన్నవి ఎంబి కేసులో అంటువ్యాధి లక్షణాలు కలిగి ఉంటాయి. ఒకరి నుండి ఒకరికి జబ్బు వ్యాపించడానికి దోహదం చేస్తాయి, చర్మంపై స్పర్శ లేని మచ్చలు ఉన్నవారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స పొందవలెను, రాష్ట్ర బృందం ఆదేశాల మేరకు మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని రేగొండ ,కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో మండల వైద్యాధికారిని డాక్టర్ హిమబిందు ,డాక్టర్ అనూష, ఆధ్వర్యంలో వైద్యాధికారులు విస్తృత తనిఖీలు క్షేత్రస్థాయి లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం స్థానిక ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పీహెచ్సీ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తూ సలహాలు సూచనలు చేశారు. కుష్టు వ్యాధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కేంద్ర బృందం సిబ్బందిని ఆదేశించారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా ఎం డి టి మాత్రల సహాయంతో పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని తద్వారా ఎలాంటి అంగవైకల్యం కలగకుండా నివారించవచ్చని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు, ఎల్ సి డి సి కుష్టు వ్యాధి సర్వే పై ప్రత్యేక అవగాహన కల్పించారు ,అనంతరం పి.హెచ్.సికి సంబంధించిన రికార్డులను, నివేదికలను, కేస్ కార్డులను, నిశితంగా పరిశీలించిన ఉన్నత అధికారులు సిబ్బందికి పలు కీలక సూచనలు సలహాలు అందించారు. అనంతరం జిల్లాలోని ఆర్ బి ఎస్ కే టీం తో ప్రత్యేక సమావేశం నిర్వహించినారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో కేంద్ర అధికారి, డైరెక్టర్ డాక్టర్ వీరకుమార్ సి.ఎల్.టి.ఆర్.ఐ , డాక్టర్ నాగరాజు సివిల్ సర్జన్, డా ,రాజు సివిల్ సర్జన్, వెంకటేశ్వర చారి డిప్యూటీ పిఎమ్ఓ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సందీప్, పీఎమ్ఓ బొజ్జ నాయక్, మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.



## డెంగ్యూ, టైఫాయిడ్ విషజ్వరాలపై కార్యాచరణ ప్రణాళిక



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 22 :** హుస్నాబాద్ పట్టణంలోని బస్తీ దవాఖానా వద్ద ఐవీఎస్, సిద్దిపేట జిల్లా వారి పర్యవేక్షణలో డెంగ్యూ మరియు టైఫాయిడ్ విషజ్వరాల నివారణ, నియంత్రణపై కార్యాచరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ASHA వర్కర్లు మరియు ANMలు పాల్గొన్నారు. విషజ్వరాల నివారణ, గుర్తింపు మరియు ముందస్తు జాగ్రత్తలపై వారికి సూచనలు అందించబడినవి.మున్సిపల్ అధికారులు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పట్టణంలో శానిటేషన్, స్ప్రేయింగ్, ఫాగింగ్ మరియు ప్రత్యేక క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఎక్కడైనా దోమల సమస్య, నీరు నిల్వ ఉండటం లేదా పారిశుధ్య సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత ప్రాంతాల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్ మరియు శుభ్రత చర్యలు చేపట్టడం జరుగుతుంది.ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురవాలని తెల్పడం జరిగింది.

ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ దండి లక్ష్మీ , కమిషనర్ మల్లికార్జున్ , వైస్ చైర్‌పర్సన్ పద్మ కౌన్సిలర్లు శ్రీనివాస్ సంపత్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ

కరీంనగర్

బుధవారం, 23 సెప్టెంబర్ 2026

సంపుటి : 18, సంచిక : 188




## ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు గడువు పొడిగింపు

### వ్యవసాయ విస్తరణ అధికారి మహిపవన్ వెల్లడి



**వెంకటాపూర్, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** నల్లగుంట క్లస్టర్ పరిధిలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను సెప్టెంబర్ 30 వరకు తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్. మహిపవన్ తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని పక్షంలో ఎరువుల బుకింగ్, సాయిల్ హెల్త్ కార్డులు, పి.ఎం. కిసాన్, రైతు భరోసా, పంట అమ్మకాలు తదితర వ్యవసాయ శాఖ పథకాల లబ్ధి పొందడంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. రైతులు తమ ఆధార్ కార్డుకు అనుసంధానమైన మొబైల్ నంబర్, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డుతో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, సమీపంలోని మీసేవ, సీఎస్సీ కేంద్రాలను గానీ సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 14 మందికి జరిమాన

**మట్టెవాడ, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ఆర్.ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 16 మంది వ్యక్తులను వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టు 3వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ ఎదుట హాజరుపరచగా వడ్డేపల్లికి చెందిన గుగులోతు వెంకట్ (41), ఖిలా వరంగల్ కు చెందిన వేల్పుల అశ్వన్ రాజ్ (32)లకు) మూడు రోజులు జైలుశిక్ష విధించగా పరకాల సబ్ జైలుకు పంపి, మిగతా 14 మంది వ్యక్తులకు కోర్టు రూ.8,600 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన ఒక వాహన దారుడికి కోర్టు రూ.300/- జరిమానా విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.

## శ్రీకృష్ణ కాలనీలో అన్నప్రసాద వితరణ



**మట్టెవాడ, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం 27వ డివిజన్లోని శ్రీకృష్ణ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహా అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ హాజరై అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, స్థానిక పెద్దలు బ్రిజ్ గోపాల్ లాహోటి, అనంతుల శ్రీనివాస్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, జారతి వెంకటేశ్వర్లు, తోగరు క్రాంతి, కాసర్ల రాజు, కర్రె వెంకన్న, సిలువేరు సాంబయ్య, జన్ను శ్యాంసుందర్, దౌడు నాగరాజ్, శ్రీ కృష్ణ కాలనీవాసులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సర్ దరఖాస్తుల స్వీకరణ



**దుగ్గొండి, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమం గడువు సమయం దగ్గర పడడం తో దుగ్గొండి మండల ఎమ్మార్వో సమ్మక్కలతో పాటు ఎంపిడిఓ డాక్టర్ లెక్కల అరుంధతి, అధికారులు జెట్ స్పీడ్‌తో నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్వో సమ్మక్క దుగ్గొండి మండలంలోని కేశవాపురం, ముద్దునూరు,గుడ్డేల్గులపల్లి, మైసంపల్లి, గ్రామ పంచాయతీలలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

## పెనుగొండ వంతెన దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం




**కేసముద్రం, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** పెనుగొండ వంతెన సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రాజుల్ పేట గ్రామానికి చెందిన అరిగే శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే, శ్రీను పెనుగొండ బ్రిడ్జి దగ్గర రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద ధాటికి ఎగిరి రోడ్డు పక్కన ఉన్న పొదల్లో పడిపోయాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న అర్పణపల్లి గ్రామానికి చెందిన యువకుడు బూడిగా బోయినా అశోక్ అతన్ని గమనించాడు. వెంటనే మానవత్వంతో స్పందించి కిందకు దిగి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నం చేశాడు. గుండెలపై ఒత్తిడి తెచ్చి, శ్వాస అందేలా చాలా సేపు ప్రయత్నించాడు. అయినా గాయాలు తీవ్రంగా ఉండటంతో శ్రీనును కాపాడలేకపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదం జరిగినా పట్టించుకోకుండా వెళ్లిపోకుండా, ఆపి కాపాడేందుకు ప్రయత్నించిన అర్పణపల్లి యువకుడు అశోక్‌ను అందరూ అభినందిస్తున్నారు. అరిగే శ్రీను మృతితో రాజల్ పేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు వైద్య విద్యార్థుల ప్రతిజ్ఞ



**నర్సంపేట, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ వైద్య కళాశాల నర్సంపేటలో మంగళవారం డ్రగ్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంతో పాటు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ (ప్రమాణం) చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ పూనం ఝా, మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి , విజయ్ కుమార్ హెచ్ ఈ, పద్మజ ఎమ్మెస్ డబ్ల్యూ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సామాజిక నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబిబిఎస్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేసి, డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



# బిక్షాటన రహిత నగరంగా వరంగల్‌ను తీర్చిదిద్దాలి!

## గ్రేటర్ కమిషనర్ వెంకన్న

**మట్టెవాడ, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరాన్ని బిక్షాటన రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో బిక్షాటనకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వారికి అవసరమైన సంరక్షణతో పాటు గౌరవప్రదమైన జీవనానికి మార్గం చూపాలని సూచించారు. మంగళవారం హన్మకొండ పరిధిలోని భీమారంలో మినిస్ట్రీ ఫర్ సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్, జిడబ్ల్యుఎంసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ పునరావాస కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో బిక్షాటన నుంచి పునరావాసం పొందుతున్న వారికి కల్పిస్తున్న వసతి, భోజనం, వైద్య సేవలు తదితర సౌకర్యాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ



కేంద్ర ప్రభుత్వం సూచించిన స్మైల్ (సపోర్ట్ ఫర్ మార్జినలైజ్డ్ ఇండివిజువల్ ఫర్ లైవ్లీ హుడ్ అండ్ ఎంటర్ప్రైజ్) కార్యక్రమంలో భాగంగా బిక్షాటన చేసేవారిని గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందిస్తూ పునరావాసం కల్పించాల్సి ఉందన్నారు. రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో బిక్షాటన చేయకుండా, స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వారిని తరలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం పునరావాస కేంద్రం నిర్వాహకులు నిర్వహిస్తున్న రిజిస్టర్లు, లబ్ధిదారుల వివరాలను కమిషనర్ పరిశీలించారు. కేంద్రంలో ఉన్న వారికి అందుతున్న సౌకర్యాలు, వైద్య సేవలు, భోజనం, వసతి తదితర అంశాలపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. కేంద్రం నిర్వహణలో అవసరమైన మౌలిక వసతులు, సేవల విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో బిక్షాటన చేస్తున్న వారిని గుర్తించడం, వారి వివరాలను నమోదు చేయడం, అవసరమైన వారికి పునరావాసం కల్పించడం వంటి అంశాల్లో బల్దియా అధికారులు, పోలీసు శాఖ, మెప్మా, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పని చేయాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీలో అదనపు కమిషనర్ జోనా, మెప్మా పీడీ రాజేశ్వర్ రావు, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, డీఎంసీ రజితా రాణి, టీఎంసీలు రమేష్, వెంకట్ రెడ్డి, హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అంజలి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ప్రత్యేక కారాగారంలో భద్రతా వ్యవస్థల తనిఖీ

**నర్సంపేట, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మహిళా ప్రత్యేక జైలులో పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపారు. నర్సంపేట పట్టణంలోని మహిళా ప్రత్యేక కారాగార ప్రాంగణంలో మంగళవారం ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేట సహాయ పోలీస్ కమిషనర్ (ఏసీపీ) రవీందర్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎం. శ్రీనివాస్ జైలును సందర్శించి క్షేత్రస్థాయిలో భద్రతా వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కారాగార జైలర్ కే. స్రవంతి నేతృత్వంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో భాగంగా జైలు ఆవరణలోని ప్రధాన ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, వాచ్ టవర్లు, కాంపౌండ్ వాల్ పరిసరాలు కీలకమైన సెక్యూరిటీ పాయింట్లను అధికారులు నిశితంగా పరిశీలించారు. అలాగే జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా కెమెరాల పనితీరును, కంట్రోల్ రూమ్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎసిపి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కారాగారంలో భద్రత పక్కాగా ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జైలు వద్ద విధులు నిర్వర్తించే



సిబ్బంది నిబంధనలను కఠినంగా పాటించాలని, లోపలికి వచ్చే సందర్శకులతో పాటు ప్రతీ వస్తువును సరిగ్గా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలని ఆదేశించారు. ఖైదీల భద్రత, ఆరోగ్యం వారి సంక్షేమానికి సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జైలర్ కే. స్రవంతితో సుదీర్ఘంగా చర్చించారు. అత్యవసర సమయాల్లో జైలు సిబ్బందికి, స్థానిక పోలీసులకు మధ్య వేగవంతమైన సమాచార మార్పిడికి ప్రత్యేక సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా కార్యక్రమంలో పలువురు పోలీస్, జైలు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిఎల్ఎస్ఏ ములుగు జిల్లా అధ్యక్షుడిగా"జన్ను నవీన్" ఎన్నిక



**వెంకటాపూర్, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన జన్ను నవీన్‌ని TLSA (తెలంగాణ లీగల్ స్టూడెంట్స్ అసోసియేషన్)'ములుగు' జిల్లా అధ్యక్షుడి ఎంపికయ్యాడు, ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు బాలు నాయక్, ఉమ్మడి వరంగల్, జిల్లా ఇంచార్జ్ సతీష్, నవీన్‌ను అభినందిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ విద్యార్థి నాయకత్వ లక్షణాలని పెంపొదించడం, సామాజిక, న్యాయ,అంశాల పైన, అవగాహన పర్చడం జ్ఞానవంతమైన సమాజాన్ని నిర్మించడం వంటి వాటిపై ,అవగాహనా కల్పించడం వంటి లక్ష్యంగా పనిచేస్తానని తెలుపుతూ, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## గణేష్ నిమజ్జనాల కోసం ఏర్పాట్ల పరిశీలన..

### పరిశీలించిన ఎమ్మార్వో సమ్మక్క, సీఐ శంకర్ రావు,ఎస్సై రావుల రణధీర్ రెడ్డి

**దుగ్గొండి, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** గణపతి నవరాత్రుల ఉత్సవాలతో నేపథ్యంలో గణేష్ విగ్రహాల నిమజ్జనాల ఏర్పాట్లను దుగ్గొండి మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఎమ్మార్వో సమ్మక్క, సీఐ శంకర్ రావు,ఎస్సై రావుల రణధీర్ రెడ్డిలు స్థానిక సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్ తో కలిసి పరిశీలించారు. పెద్ద చెరువులో రైతు వేదిక సమీపంలో విగ్రహాల నిమజ్జనాలకు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో సమ్మక్క, సీఐ శంకర్ రావు,ఎస్సై రావుల రణధీర్ రెడ్డిలు మాట్లాడుతూ వర్షాభావం లేనందున మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులో నీరు అడగండిపోయాయని ఈ నేపథ్యంలో సరిపడ నీళ్లు ఉన్న చెరువుల్లో నిమజ్జనాలు చేయాలని సూచించారు. దుగ్గొండి మండల కేంద్రంలోని పెద్ద చెరువులో నీరు సరిపడ ఉన్నందున మండల పరిధిలోని వివిధ గ్రామాల వినాయక విగ్రహాల



ను నిమజ్జనం చేసుకోవచ్చని కోరారు. మండలంలోని దుగ్గొండి, తిమ్మంపేట,నాచినపల్లి, మల్లంపల్లితో పాటు పలు గ్రామాల్లో గల ఎరువులలో నిమజ్జన ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిమజ్జనాల ఏర్పాట్ల వద్ద విద్యుత్తు లైటింగ్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సర్పంచ్లకు ఆదేశించారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా రమజ్యోతి




**కేసముద్రం, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని అర్పణపల్లి ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల సంఘం అధ్యక్షురాలిగా కార్తీక గ్రామ సంఘం అధ్యక్షురాలు చిరుత రమజ్యోతి మంగళవారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో అందరి అంగీకారంతో రమజ్యోతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమజ్యోతి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తానని చెప్పారు. పిల్లలకు మంచి చదువు, మంచి వసతులు అందేలా చూస్తానని, తల్లిదండ్రులు అందరూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచాలని కోరారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమని ప్రధాన ఉపాధ్యాయులు తెలిపారు.

# వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధం!

### జిడబ్ల్యూఎంసీ పరిధిలో సుమారుగా 19 ప్రధాన చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు

### 30 క్రేన్లు, 145 మంది గజ ఈతగాళ్లు, 500 మంది సిబ్బంది అందుబాటులో

### బల్దియా కమిషనర్ వెంకన్న



**మట్టెవాడ, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బల్దియా కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, భద్రత, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను సమగ్రంగా చేపట్టినట్లు ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ జిడబ్ల్యూఎంసి పరిధిలో సుమారు 8 వేల విగ్రహాలను నిమజ్జనం చేయుటకు గాను హన్మకొండలోని బంధం చెరువు, సిద్ధేశ్వర గుండం, కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని భీమారం చెరువు, హసన్‌పర్తిలోని పెద్ద చెరువు, ఖాజీపేటలోని పరిగి కుంటతో పాటు వరంగల్‌లోని చిన్నవడ్డేపల్లి, ఉరుసుగుట్ట, రంగస ముద్రం, రంగశాయిపేట, మామునూరు బేస్తం చెరువు, గీసుకొండలోని కట్టమల్లన్న చెరువు తదితర నిమజ్జన కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు, దీనికి తోడుగా చిన్నచిన్న చెరువులలో కూడా చిన్న విగ్రహాలు వేయుటకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయక విగ్రహాలు నిమజ్జన కేంద్రాలకు సురక్షితంగా చేరుకునేలా ప్రధాన రహదారుల్లోని గుంతలను పూడ్చడంతో పాటు, రహదారుల వెంట ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించినట్లు తెలిపారు. నిమజ్జన కేంద్రాల పరిసరాల్లో బుష్ కటింగ్, పారిశుద్ధ్య పనులు, చెరువుల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. బల్దియా ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నిమజ్జన సమయంలో భారీ విగ్రహాలను చెరువుల్లోకి తరలించేందుకు 30 క్రేన్లను అందుబాటులో ఉంచామని, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా వివిధ నిమజ్జన కేంద్రాల వద్ద 145 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచినట్లు కమిషనర్ వెల్లడించా రు. భక్తులు నీటిలోకి వెళ్లకుండా అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు, తెప్పలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### ప్రత్యేక అధికారులకు బాధ్యతలు

నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు బల్దియా సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్‌ను ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు కమిషనర్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సంతోష్ బాబును వరంగల్ ప్రాంతానికి, రవికుమార్‌ను హన్మకొండ ప్రాంతానికి ఓవరాల్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంజయ్ కుమార్‌కు అండర్ రైల్వే జోన్, ఉరుసుగుట్ట, అగర్తల చెరువుల నిమజ్జన ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ప్రతి నిమజ్జన కేంద్రం వద్ద డీఈ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏఈలు, కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు ఆయా కేంద్రాల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, పరిస్థితులను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టేలా బాధ్యతలు కేటాయించినట్లు వివరించారు.

### వివిధ శాఖల సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు

నిమజ్జన కేంద్రాల వద్ద పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుద్దీకరణ, ప్రధాన కూడళ్లో మంచినీటి సదుపాయం, రాకపోకలు, బారికేడింగ్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు బల్దియా అధికారులు, పోలీసులు, రెవెన్యూ, మైనింగ్, రోడ్లు భవనాల, మత్స్య ఇరిగేషన్ తదితర ప్రభుత్వ శాఖలు, గణేష్ ఉత్సవ కమిటీలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, సురక్షితంగా, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా నిర్వహించేందుకు భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు బల్దియా, పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ టి.వెంకన్న కోరారు.

## ఉద్యోగ అర్హత వయస్సును 49 ఏండ్లకు పెంచాలి : మారపల్లి మల్లేష్



**చిట్యాల, సెప్టెంబర్ 22 (పిపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని నిరుద్యోగ అభ్యర్థుల ఉద్యోగ అర్హత వయస్సును పెంచి వారికి ఉద్యో గాలకు అవకాశం కల్పించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో మాట్లాడుతూ గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు రాలేదని వారి సమయం వయస్సును కోల్పోయి నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక గత 12 సంవత్సరాల నుండి ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపోవడంతో నిరుద్యోగ అభ్యర్థులు వారి వయసును కోల్పోయారని దీన్ని దృష్టిలో ఉంచుకొని 49 ఏండ్లకు పెంచాలని ఎస్సీ ఎస్టీలకు అదనంగా మరో ఐదేళ్లు సడలించి 54 ఏండ్లకు పెంచి వారికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## జాతీయ మాల మహానాడు మండల అధ్యక్షులుగా మెట్టు పవన్



**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని ఆకినపెల్లి గ్రామానికి చెందిన మెట్టు పవన్‌ను జాతీయ మాల మానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు మంగళవారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో మొగుళ్ళపల్లి మండల అధ్యక్షునిగా మెట్టు పవన్ ను నియమించారు. ఈసందర్భంగా మెట్టు పవన్ మాట్లాడుతూ. నాపై నమ్మకంతో అధ్యక్షునిగా నా ఎన్నికకు సహకరించిన నా మాలలకు, మాలజాతి కోసం మాలల కు జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం పోరాటం చేయడమే కాకుండా మొగుళ్ళపల్లి మండలంలో ఉన్న ప్రతి మాల విద్యార్థి యువకులను కలసి వర్గీకరణ వ్యతిరేకం గురించి ఈ రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని సవరించే వరకు ఒత్తిడి తీసుకు వస్తామని పవన్ డిమాండ్ చేశారు. నా ఎన్నిక సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పి సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## సీఐని కలిసిన ఆర్టిఐ నాయకులు




**చిట్యాల, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** చిట్యాల నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వై సతీష్ ను యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఆర్టిఐ ఉపయోగపడుతుందని అన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధంగా ఉపయోగపడు తుందని ప్రభుత్వాధికారులు ప్రజలకు జవాబుదారుతనం ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మండల ఆర్టిఐ కన్వీనర్ ఏలేటి రామ్ రెడ్డి దేవరకొండ సత్యనారాయణ గుర్రపు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్స్ ఇవ్వాలి : దొడ్డే శంకర్ మాదిగ




**చిట్యాల, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్స్ విడుదల చేసి నిరుద్యోగుల కు న్యాయం చేయాలని ఎంఎస్పి మండల అధ్యక్షులు దొడ్డే శంకర్ మాదిగ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇంతవరకు వాటికి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం సరైనది కాదన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తెలంగాణ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా తెలంగాణ స్వరాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్స్ విడుదల చేసి కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితిలో ఉన్న నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి వారికి న్యాయం చేయాలన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించే అవకాశాలపై ప్రభుత్వం ఆలోచించి వారిని ఆదుకోవాలని అన్నారు.

# నాణ్యమైన వరి విత్తనాలను ఉత్పత్తి చేయడమే ప్రధాన లక్ష్యం

**రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త డా,, కె. మదన్ మోహన్ రెడ్డి**




**మొగుళ్లపల్లి, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలో జయశంకర్ భూపాలపల్లి రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కే. మదన్ మోహన్ రెడ్డి వరి విత్తనోత్పత్తి క్షేత్రాలను పరిశీలించిన ఆయన నాణ్యమైన వరి విత్తనాలను ఉత్పత్తి చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో, నాబార్డ్ నిధులతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) ద్వారా చేపడుతున్న వరి విత్తనోత్పత్తి కార్యక్రమంలో భాగంగా మొగుళ్ళపల్లి గ్రామానికి చెందిన పడిదల బాపురావు సాగు చేస్తున్న వరి విత్తనోత్పత్తి క్షేత్రాన్ని శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జయశంకర్ భూపాలపల్లి శాస్త్రవేత్త కోఆర్డినేటర్ డా. కె. మదన్ మోహన్ రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్ శాస్త్రవేత్తలు డా. పద్మజ, డా. వీరన్న, డా. క్రాంతి కుమార్, పాల్గొన్నా రు. ప్రస్తుతం పంట పిలకల దశలో ఉన్నట్లు గుర్తించిన శాస్త్రవేత్తలు, పంట పరిస్థితిని పరిశీలించి సమతుల్య పోషక యాజమాన్యం, ఎరువుల వినియోగం, పురుగులు, తెగుళ్ల నివారణపై రైతుకు శాస్త్రీయ సూచనలు అందించారు. విత్తనోత్పత్తి క్షేత్రాల్లో ఇతర రకాల మొక్కలు (ఆఫ్ – టైప్స్), కలుపు మొక్కలను తొలగించి, పంటను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. పిఏసిఎస్‌ల ద్వారా రైతులను విత్తనోత్పత్తిలో భాగస్వాములను చేసి, గ్రామస్థాయిలో నాణ్యమైన వరి విత్తనాల ఉత్పత్తిని అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డా. కె. మదన్ మోహన్ రెడ్డి తెలిపారు. నాబార్డ్ సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, స్థానికంగా విత్తనోత్పత్తిని ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్షేత్ర సందర్శనలో. ఎంఎఒ సురేందర్ రెడ్డి, మొగుళ్ళపల్లి పిఎసిఎస్ సీఈఓ అప్పం సాగర్, రైతులు పాల్గొన్నారు.

## రైతు రిజిస్ట్రీపై పేద్దకోడెపాకలో అవగాహన



**శాయంపేట, సెప్టెంబర్ 22,(పీపుల్స్ డైరీ) :** శాయంపేట మండలం పేద్దకోడెపాక గ్రామంలో రైతు రిజిస్ట్రీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ మంద టీనా, వ్యవసాయ విస్తరణ అధికారి అన్వేష్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. 01-01-2026 నుండి 13-08-2026 మధ్యకాలంలో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులు, అలాగే ఇంతకు ముందు రైతు రిజిస్ట్రీ చేయించుకోని పాత రైతులు తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)లను సంప్రదించాలి. ప్రత్యామ్నాయంగా, సమీప మీ సేవా కేంద్రాల్లో కూడా రైతు రిజిస్ట్రీ నమోదు చేసుకోవచ్చని ప్రియదర్శిని తెలిపారు. వరి, పత్తి, ఇతర పంటల కొనుగోళ్లకు రైతు ఐడీ తప్పనిసరి అని, అలాగే ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకోవడానికి రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొ న్నారు. అదేవిధంగా, పంట రుణాలు పొం దేందుకు, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలను పొందేందుకు కూడా రైతు రిజిస్ట్రీ అవసరమని తెలిపారు. రైతు రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేసేందుకు నేటి నుండి ఈనెల 30 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరణించిన రైతులు, భూమిని విక్రయించిన కేసులు మినహా, సెప్టెంబర్ 30వ తేదీ నాటికి 100 శాతం రైతు రిజిస్ట్రీ పూర్తి చేయాలని ఆమె సూచించారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు రైతులతో సమన్వయం చేసుకుని, వారికి అవసరమైన సహకారం అందిస్తూ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి : ఆర్డీఓ



**గణపురం, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని భూపాలపల్లి ఆర్డీవో హరికృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని బుర్రకాయలగూడెం గణపసముద్రం చెరువు వద్ద నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువు వద్ద విగ్రహాల నిమజ్జనానికి క్రేన్లు, వీధి దీపాలు, రెస్క్యూ టీం అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిమజ్జన సమయంలో భక్తులు అధికారులకు సహకరించి వేడుకలను సురక్షితంగా, ప్రశాంతంగా ముగించాలని ఆర్డీవో కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కట్కూరి రాధిక శ్రీనివాస్, తుమ్మల సంపత్, ఐబి ఈ ఈ రాము, డి ఈ సదయ్య, సీఐ కరుణాకర్ రావు, ఎంపీడీవో శ్రీకాంత్ ఎస్ఐ బి అశోక్, డీటీ భాస్కర్, ఆర్ ఐ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, జిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయి



**శాయంపేట, సెప్టెంబర్ 22,(పీపుల్స్ డైరీ) :** శాయంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల( బాలుర) క్రీడా మైదానంలో ఎస్ జి ఎఫ్ మండల స్థాయి 14, 17 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. శాయంపేట పోలీసుల సహకారంతో నరసింహారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో,పరకాల ఏ సీ పి చిర్ర సతీష్ బాబు,పరకాల రూరల్ సి ఐ వై. సుధాకర్ రెడ్డి, స్థానిక ఎస్ ఐ జక్కుల పరమేశ్వర్ , ట్రస్ట్ ప్రతినిధి ప్రశాంత్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన 144 మంది బాలబాలికలకు స్పోర్ట్స్ యూనిఫార్మ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పరకాల ఏ సీ పి చిర్ర సతీష్ బాబు, పరకాల రూరల్ సి ఐ వై.సుధాకర్ రెడ్డి, స్థానిక ఎస్ ఐ జక్కుల పరమేశ్వర్, శాయంపేట ఎం ఈ వో బిక్షపతి పాల్గొని, జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్ పి హెచ్ ఎస్ (బాలురు ) హెచ్ ఎం జనార్ధన్ , పి డి డా॥సూరం రామ్ రెడ్డి, తరంగిణి, గీత, జ్యోతి , ధన్‌పాల్ హాజరయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన 144 మంది బాలబాలికలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాబోయే పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## పత్తిలో తలమాడు తెగులు నివారణ చర్యలు చేపట్టాలి

**గులాబీ పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి - టిఆర్‌వికె శాస్త్రవేత్త రాజుకుమార్**



**గీసుకొండ, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** పత్తి పంటలో ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితుల వల్ల రసం పీల్చే పురుగుల ద్వారా తలమాడు తెగులు గులాబీ రంగు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున, రైతులు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం టిఆర్‌వికె శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. గీసుకొండ మండలం మనుగొండ గ్రామంలో రైతు చాపర్తి రంజిత్‌కు చెందిన పత్తి పంటను క్షేత్రస్థాయిలో సందర్శించి, పంట ఆరోగ్యాన్ని పరిశీలించి రోగ నిర్ధారణ చేశారు.

**తలమాడు తెగులు (టొబాకో స్ట్రీక్ వైరస్) -- సమగ్ర యాజమాన్యం**

ఆగస్టు మాసంలో కురిసిన వర్షాలకు పొలాల గట్లపై పెరిగిన కలుపు మొక్కల వల్ల, ప్రస్తుత బెట్ట (పొడి) వాతావరణంలో తామర పురుగుల ఉధృతి పెరుగుతుంది. ఇవి టొబాకో స్ట్రీక్ వైరస్‌ను వ్యాప్తి చేసి తలమాడు తెగులుకు దారితీస్తాయి. ఈ తెగులు వల్ల దిగుబడి దాదాపు 62 శాతం వరకు తగ్గే ప్రమాదం ఉంది. ఈ తెగులు సోకినా మొక్కల లేత ఆకులు రంగు మారి, ఎదుగుదల ఆగి కుచించుకుపోతాయి. చివరికి ఆకులు నల్లగా మారి మాడిపోతాయి. కొమ్మలు ఎండిపోయి, పూమొగ్గలు, గూడలు మాడిపోయి రాలిపోతాయి. ఈ వ్యాధి గట్లపై ఉండే వయ్యారిభామ, తుత్తురు బెండ వంటి కలుపు మొక్కలు పూత దశలో ఉన్నప్పుడు, తామర పురుగులు వాటి పూలలోని వైరస్ కలిగిన పుప్పొడిని పత్తి మొక్కలకు వ్యాప్తి చేస్తాయి. నివారణకు చేనులో గట్లపైన ఉన్న వయ్యారిభామ వంటి కలుపు మొక్కలను పూతకు రాకముందే పీకి నాశనం చేయాలన్నారు. కార్యక్రమంలో టిఆర్‌వికె శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ బి.వి. రాజకుమార్, మండల వ్యవసాయ అధికారి పి.హరి ప్రసాద్ బాబు, ఏఎంసి ఏఎంసీ డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్, ఏలుకుర్తి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ పి.స్మిత, మనుగొండ, చంద్రయ్యపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**చిట్యాల, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని జడల్ పేట గ్రామంలో మృతి చెందిన వృద్ధుల కొమరారెడ్డి (రాజు) కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ స్పీకర్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పాకాల బుచ్చిరెడ్డిని ఆత్మీయంగా పలకరించి ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తనను కలవాలని బుచ్చిరెడ్డి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేష్ ముదిరాజ్ గురుకుంట్ల కిరణ్ భయగాని గణపతి నల్ల దేవేందర్ రెడ్డి పుల్లూరి నారాయణ మేడిపల్లి విష్ణువర్ధన్ రావు పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


## నూతన సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**దుగ్గొండి, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** దుగ్గొండి మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ (సర్కిల్ ఇన్స్‌పెక్టర్) ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు నూతన సీఐకి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, శాంతిభద్రతల విషయంలో ప్రజాప్రతినిధులుగా తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వేముల ఇంద్రదేవ్ ఉపాధ్యక్షులు కోటగిరి భాస్కర్ ప్రధాన కార్యదర్శి గోగుల్ల శ్రీనివాసరెడ్డి కార్యదర్శి సుఖినే నాగరాజు అధికార ప్రతినిధి జంగిలి రాజు కోశాధికారి కోలుగూరి సుజాత సభ్యులు రాస రమ చేరాలు అజ్మీరా రజిత తిరుపతి బూర రాధిక హేమ చం ద్ బుర్రి రాంబాబు పెండ్లి వెంకటేశ్వర్లు కన్నం అలీమా చిరంజీవి ఉత్తరేణి భాగ్యలక్ష్మి రాజబాబు అజ్మీర నిర్మలా వంశీ భాదరగోని రమేష్ డైరెక్టర్ ధశీజయ నాయక్ పాల్గొన్నారు

## డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

**ఎంవివి కన్వీనర్,ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ మాదాసి సురేష్!**



**హనుమకొండ, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** మాదిగ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకుడు, మాదిగ హక్కుల దండోరా గౌరవ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత, పేదల డాక్టర్‌గా పేరుగాంచిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాబోయే నల్గొం, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విద్యావంతుల వేదిక (ఎంవీవీ) కన్వీనర్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం డాక్టర్ రామకృష్ణ ఎంతో కృషి చేశారని,రామకృష్ణ హాస్పిటల్ ద్వారా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కాకతీయ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ (కేమ్యాక్స్) ద్వారా ప్రజలకు విద్య,వైద్యము, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. మాదిగలకు కాంగ్రెస్ పార్టీ కన్నతల్లి లాంటిదని, అలాంటి పార్టీలో మాదిగ బిడ్డకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత తమదన్నారు. పార్టీ అధిష్టానం డాక్టర్ రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని, లేదా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత సంఘాల నాయకులు మోరే ఐలయ్య, రాము పాల్గొన్నారు.

## కేసముద్రంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



**కేసముద్రం, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలంలో గణేష్ నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.మండలంలోని ప్రధాన చెరువు వద్ద నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. చెరువు వద్ద క్రేన్లు, లైట్ల ఏర్పాటు, పారిశుద్ధ్య పనులు, రాకపోకలకు అనుకూలంగా దారి ఏర్పాటు చేశారు. ఈ పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు.భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చూడాలని, పోలీసు బందోబస్తుతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ పరిశీలనలో తహశీల్దార్, ఎస్సై, ఇతర శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ‘ట్రైసిటీలో మార్మోగుతున్న గణనాథుని నామస్మరణ!’

వరంగల్ రూరల్ ఇల్లంద గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

కాశిబుగ్గలోని వీరభద్రయ్య కుల సంఘం ఆధ్వర్యంలో...





కాశిబుగ్గ మార్కండేయ (పద్మ)నగర్‌లో...

ఆత్మకూరు మండలం చౌళ్ల పెల్లి గ్రామం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో...





“చారిత్రక నగరాలైన వరంగల్, హనుమకొండ, కాజీపేట (ట్రైసిటీస్) భక్తిపారవశ్యంలో మునిగితేలుతున్నాయి. ట్రైసిటీల నడిబొడ్డున భక్తి, సంస్కృతి మరియు కళల కలయికగా నిలిచిన గణేష్ చతుర్థి వేడుకల ప్రత్యేక దృశ్య మాలిక ఇది. ఊరూ వాడా కొలువుదీరిన అద్భుతమైన వినాయక విగ్రహాలు, మండపాల వద్ద భక్తుల కోలాహలంతో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వివిధ ఆకృతుల్లో నయనానందకరంగా దర్శనమిస్తున్న వినాయకుల చిత్రాలు మీకోసం...”



కాశిబుగ్గలోని యువభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



భట్టుపల్లిలోని ఎర్రకోట కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



కాశిబుగ్గలోని గ్రంథాలయం వద్ద...



ఇల్లంద గ్రామంలోని బొడ్రాయి వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



కాజీపేటలోని విష్ణుపురిలో యంగ్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



ఎల్బీనగర్ లోని స్వర్ణ భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



ఉర్సు బొడ్రాయి నాగమయ్య గుడి దారిలో గణేష్ యువశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



కాశిబుగ్గ సర్కార్ బావి దగ్గర నవజ్యోతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



## ప్రభుత్వ వైద్యశాలకు సిరంజీలు అందజేత

**ఏన్కూరు, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూర్ ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు సిరంజీలు కొరత ఉన్నదని తెలుసుకున్న ఏన్కూర్ మెడికల్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 2 ఎంఎల్, సిరంజీలు 20 బాక్సులు, 5000 రూపాయలు ఖరీదైన బాక్సుల ను ప్రభుత్వ వైద్యాధికారి నంద్యాల బాలకృష్ణకి అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ మండల అధ్యక్షులు గుడ్ల వెంకటేశ్వరరావు, సీనియర్ ఆర్ ఎం పి .డాక్టర్ కోపెల రామారావు, మెడికల్ అసోసియేషన్ మండల కమిటీ సభ్యులు పాలెపు పాపారావు, షేక్ హుస్సేన్ ఉద్దీన్, బి మోహన్, షేక్ పెంటు సాహెబ్, ఆర్ శివ , సీనియర్ ప్రాక్టీషనర్ భస్మాంగి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ ఉప్పెర్ల వెంకటరమణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో గత కొన్ని రోజుల నుండి సిరంజీలు లేక వచ్చిన పేషెంట్లకు వైద్యం అందించడం కష్టంగా ఉందని ఆ విషయాన్ని ఏన్కూర్ మెడికల్ అసోసియేషన్ తెలియజేయడం జరిగిందని వారు మాకు 5000 రూపాయలు విలువైన సామాగ్రిని అందజేశారని వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి



**ఏన్కూరు సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏన్కూర్ లో హిస్టరీ లెక్చరర్ సుందర్, లైబ్రరియన్ కవిత తో ఎకో క్లబ్ ఏర్పాటు చేయడం జరిగిందనీ ప్రిన్సిపాల్ సింహాచలం తెలిపారు. మంగళవారం పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ఏన్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణం లో 120 మొక్కలు నాటారు.విద్యార్థులు వారి తల్లితండ్రులు పేరున మొక్కలు నాటి ,వాటిని తల్లితండ్రులు గా భావించి సంరక్షణ చేయాలని ప్రిన్సిపాల్ సూచించారు. కళాశాల గ్రౌండ్ శుభ్రతలో డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరావు చాలా సహకరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలో మొక్కలు నాటిన తహసీల్దార్



**ఏన్కూర్, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ):** ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సిహెచ్. శేషగిరిరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే మొక్కల సంరక్షణపై అవగాహన పెంపొందించ కోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సంరక్షించినప్పుడే కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అన్నారు.పచ్చని చెట్లు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.నాటిన ప్రతి మొక్కను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సొంత మొక్కగా భావించి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఒక్క మొక్క నాటడం కాదు ఒక తరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం మా కర్తవ్యం అని ప్రతిన పూనారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. చంద్రరావు,బి.రవి,బి. సింగ్య, బి.శోభన్ నాయక్,పాయం శ్రీనివాస్, వి.రమేష్,డి. వెంకటరమణ, బి.శారదాబాయి, డి.ఉషశ్రీ, బి.కపూర్య, కళ్యాణి,పద్మ,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల నిధుల నిర్వహణపై హెచ్ఎంలకు అవగాహన



**పినపాక, సెప్టెంబర్ 22(పీపుల్స్ డైరీ) :** పినపాక మండల విద్యాశాఖ అధికారి కొమరం నాగయ్య ఆధ్వర్యంలో మండల స్థాయిఎస్ఎన్ఏ స్పర్శ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల నోడల్ డీడీఓ, రిసోర్స్ పర్సన్ డి. రామిరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు విడుదలైన నిధుల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు ప్రభుత్వం విడుదల చేసే నిధులను ఎస్ఎన్ఏ స్పర్శ్ విధానం ద్వారా నిర్వహించడం, ఆర్థిక లావాదేవీలను చేపట్టడం, నిధుల వినియోగంలో పాటించాల్సిన నిబంధనలు, పాఠశాల స్థాయిలో చేపట్టాల్సిన ప్రక్రియలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులకు వివరించారు. నిధులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం వినియోగిస్తూ, ప్రతి ఆర్థిక లావాదేవీని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలలకు అందుతున్న నిధుల వినియోగంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, సంబంధిత విధివిధానాల ను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా పాఠశాల స్థాయిలో నిధుల నిర్వహణ, ఆర్థిక పారదర్శకత, సమర్థవంతమైన వినియోగంపై ప్రధానోపాధ్యాయులకు అవసరమైన మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏజీహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్. వీరాకుమారి, జెడ్పీహెచ్ ఎస్ జానంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కె. విజయలక్ష్మి, దుగినేపల్లి ప్రధానోపాధ్యాయుడు ఎం. రాంగోపాల్, కేజీబీవీ ఎస్ఓ పద్మతో పాటు మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలు, మినీ గురుకులాలు, ఇతర ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదు

### సుదిమల్ల సర్పంచ్ కుంజ సుగుణయ్య



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** ఎన్నో సంవత్సరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములు, వారి పూర్వీకుల కాలం నుంచి వినియోగంలో ఉన్న మట్టి రహదారులపై వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని సుదిమల్ల సర్పంచ్ కుంజ. సుగుణయ్య పలువురురైతులు పేర్కొన్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు మరమ్మతులు చేసుకున్న పాత రహదారిపై అనవసర ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అదేవిధంగా గిరిజనుల పేరునుఉపయోగించుకుని ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేయడం, ప్రభుత్వ అధికారులు, అటవీశాఖ సిబ్బందిపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. అధికారులపై ఒత్తిడి తీసుకురావడానికి సోషల్ మీడియా, మీడియా వేదికలను ఉపయోగించకుండా సమస్యకు సంబంధించిన వాస్తవాలు, ఆధారాలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అటవీశాఖ అధికారులు ముడుపులు తీసుకున్నారంటూ ఎవరైనా ఆరోపణలు చేస్తున్నట్లయితే, అందుకుసంబంధించిన ఆధారాలను ప్రజల ముందే ఆరోపణల రూపంలో ప్రచారం చేయడం కాకుండా, సంబంధిత చట్టబద్ధ అధికారుల ముందు సమర్పించాలని తెలిపారు. ఆధారాల ఆధారంగా విచారణ జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిరాధార ఆరోపణలకు బదులుగా ఆధారాలతో కూడిన సమాచారాన్ని వెల్లడించాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉన్నట్లయితే చట్టబద్ధమైన మార్గంలో సంబంధిత అధికారులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలని సూచించారు.

## మామునూరు ఎయిర్‌పోర్టుకు 'రాణి రుద్రమదేవి' పేరు పెట్టాలి

### 'ఎక్స్' వేదికగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన టిజిఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



**హైద్రాబాద్, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ సామ్రాజ్యాన్ని సమర్థంగా పరిపాలించిన వీరనారి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కాకతీయుల చరిత్ర తెలంగాణ సాంస్కృతిక వైభవం మహిళా నాయకత్వానికి ప్రతీకగా నిలిచిన రాణి రుద్రమదేవి పేరు మామునూరు విమానాశ్రయానికి పెట్టడం ద్వారా తెలంగాణ చారిత్రక వారసత్వాన్ని గౌరవించినట్లవుతుందని ఆయన పేర్కొన్నారు. మామునూరు ఎయిర్ పోర్టు అభివృద్ధి వరంగల్ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని, విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి పేరు పెట్టడం ద్వారా కాకతీయుల ఘన చరిత్రను దేశవ్యాప్తంగా పరిచయం చేసే అవకాశం ఉంటుందని రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సమ్మక్క-సారలమ్మ పేరు పెట్టాలి

### తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ



**కరకగూడెం, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణలో నిర్మితమవుతున్న వరంగల్ విమానాశ్రయా నికి ఆదివాసీ వీరనారీమణులు సమ్మక్క--సారలమ్మపేరును పెట్టాలని తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ డిమాండ్ చేశారు. సమ్మక్క--సారలమ్మలు కేవలం ఆధ్యాత్మికంగా ఆరాధించబడే దేవతలు మాత్రమే కాదని, ఆదివాసీ సమాజ ఆత్మగౌరవం, ధైర్యం, త్యాగం, హక్కుల పరిరక్షణకు ప్రతీకలుగా నిలిచిన చారిత్రక మహిళా ప్రతిరూపాలు అని ఆయన పేర్కొన్నారు. తమ ప్రజల హక్కులు, స్వాభిమానం కోసం ప్రతిఘటించిన వారి వీరత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తోందన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు సమ్మక్క--సారలమ్మ పేరు పెట్టడం కేవలం పేరు మార్చే అంశం కాదు. ఇది ఆదివాసీ చరిత్రకు ఇచ్చే గౌరవం. ఆదివాసీ త్యాగాలకు ఇచ్చే గుర్తింపు. తెలంగాణ గడ్డకు, సమ్మక్క--సారలమ్మల వీరత్వానికి లభించే గౌరవం అని వెంకటనారా యణ అన్నారు. విమానాశ్రయానికి వచ్చే దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులకు సమ్మక్క--సారలమ్మల చరిత్ర, ఆదివాసీ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకునే అవకాశం కల్పించేలా విమానాశ్రయ ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలని కూడా ఆయన సూచించారు.

## సినీ హీరో నానిని కలిసిన జనసేన నాయకుడు సిద్ధూ



**చెన్నూరు, సెప్టెంబర్ 22(పీపుల్స్ డైరీ) :** హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో ప్రముఖ నటుడు, 'నేచురల్ స్టార్' నానిని చెన్నూర్ జనసేన రాష్ట్ర నాయకులు, మెగా యూత్ ఫోర్స్ మంచిర్యాల జిల్లా నాయకులు సిద్ధూ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం గొప్ప విజయం సాధించాలని కోరుకుంటూ, ఆయనకు సిద్ధూ ముందుగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చెన్నూర్, మంచిర్యాల, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురు అభిమానులను సిద్ధూ స్వయంగా నాని వద్దకు తీసుకెళ్లి, వారి నటుడిని నేరుగా కలిసే అరుదైన అవకాశాన్ని కల్పించారు. అంతేకాకుండా అభిమానులకు సినిమా పాసులను కూడా అందజేశారు. తమ అభిమాన కథానాయ కుడిని కలిసే భాగ్యం కల్పించడంతో పాటు పాసులు అందించినందుకు అభిమానులు సిద్ధూకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామాలలో అన్నప్రసాద వితరణ



**ఏన్కూరు, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఏన్కూరులో జరిగిన అన్నదాన కార్యక్రమాలను ఎండిఓ భాగ్యశ్రీ ,పోలీస్ సిబ్బంది బి రవి , శ్రీహరి,దేవేందర్ ప్రారంభించారు. తొమ్మిది రోజులపాటు జరిగిన నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. నిమజ్జనోత్సవాల ను కూడా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని వారు కోరారు. కార్యక్రమాలలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రవీందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



**మణుగూరు, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** మణుగూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వంగా రవీందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. జన్మదినాన్ని పురస్కరించుకుని సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఋూ కార్యాలయానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యల పరిష్కారంలో మరింత చురుకైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. జన్మదిన సందర్భంగా తనను కలిసి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్, ఉప సర్పంచ్, నాయకులకు ఋూ వంగా రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. గణేష్ రెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, ఎండి యాకూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## మూలన పడ్డ రథం.. మున్సిపాలిటీ మౌనం!

### వైకుంఠ యాత్ర రథం పాడైపోతున్నా పట్టించుకునే నాథుడే లేడా?

**మణుగూరు, సెప్టెంబర్ 22 (పీపుల్స్ డైరీ) :** ప్రజల అవసరాల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ ఆస్తులు అధికారుల నిర్లక్ష్యంతో మూలన పడి క్రమంగా పాడైపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వైకుంఠ యాత్ర రథం ప్రస్తుతం సంరక్షణ లేకుండా పాడైపోయిన స్థితిలో కనిపిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రజా కార్యక్రమాల్లో ఉపయోగపడిన ఈ రథం ప్రస్తుతం కార్యాలయ ఆవరణలోనే నిరుపయోగంగా పడివుండటం చర్చనీయాంశంగా మారింది. నెలల తరబడి సంరక్షణ లేకపోవడంతో రథం పరిస్థితి మరింత దెబ్బతింటోందని స్థానికులు అంటున్నారు. మరమ్మతులు చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకురావాల్సిన ఆస్తిని ఇలా వదిలేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

### అధికారుల కళ్ల ముందే పాడైపోతున్నా చర్యలు ఎక్కడ?

మున్సిపాలిటీ కార్యాలయంలోనే రథం ఉండగా దాని పరిస్థితి అధికారులకు తెలియదా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? రథాన్ని పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు ఎందుకు సిద్ధం చేయలేదు? నిర్వహణకు నిధులు అవసరమైతే వాటిని




సమకూర్చే ప్రయత్నం ఎందుకు జరగలేదు? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తి అంటే ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, అది ప్రజల సొమ్ముతో ఏర్పడినదని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఒక ఆస్తి పాడైపోతున్న విషయం తెలిసిన తర్వాత కూడా పట్టించుకోకుండా వదిలేస్తే, చివరకు అది పూర్తిగా పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు మరమ్మతుల ఖర్చు కంటే కొత్తగా ఏర్పాటు చేసే ఖర్చే ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది.

## భూ రీ-సర్వే పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్

**పినపాక, సెప్టెంబర్ 22(పీపుల్స్ డైరీ) :** పినపాక మండలం సున్నంవారి గూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పనుల పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసి ఉన్న ప్రాంతాల్లో రికార్డుల ఆధారంగా భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని అధికారులకు సూచించారు. రీ-సర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు, రైతులతో మాట్లాడి రీ-సర్వేకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, సర్వేయర్ నరేష్, జిపిఓలు, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com